నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
గురువారం | 22 ఫిబ్రవరి 2024 | www.navatelangana.com

మహిళలు అన్ని రంగాల్లో సమానత్వాన్ని సాధించాలి

నవతెలంగాణ-బెజ్జంకి



పురుషులకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో సమానత్వాన్ని సాధించాలని జిల్లా సంక్షేమాధికారిణి సావిత్రి సూచించారు. బుధవారం మండల పరిధిలోని బేగంపేట ప్రభుత్వోన్నత పాఠశాలలోని విద్యార్థినిలకు మహిళ సాధికారత అధ్వర్యంలో మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, డయల్ 181, పిల్లల సంరక్షణ రక్షణ డయల్ 1098, అంగన్వాడీ, బాల్య వివాహాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పౌష్టికాహారంపై గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సీడీపీఓ జయమ్మ, సూపర్ వైజర్ నాగారాణి, మహిళ సాధికారత జిల్లా కో ఆర్డీనేటర్ వేసవి,లింగ సమానత్వ ప్రత్యేక ప్రతినిధులు పద్మ,లావణ్య,ప్రతిమ సఖి కేంద్రం నిర్వహాకురాలు అమని, పాఠశాల బోధన సిబ్బంది,విద్యార్థినిలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేసే వారికే పార్టీ సభ్యత్వం

నవతెలంగాణ-జహీరాబాద్



నిరుపేదల సంక్షేమానికి ఉద్యమాలు చేసిన వారికే తమ పార్టీలో సభ్యత్వం లభిస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ అన్నారు. జహీరాబాద్‌లో పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. మొదటి సభ్యత్వాన్ని చిరంజీవికి ఇచ్చినట్టు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) బడుగు బలహీన వర్గాల ప్రజలకు కన్నతల్లి లాంటిదని అభివర్ణించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ నిరంతరం పోరాడుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.ఆనంద్, పార్టీ నాయకులు అశోక్, అజర్ తదితరులు పాల్గొన్నారు.

పస్తుల్లో పంచాయతీ కార్మికులు

బండెడు చాకిరి చేస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలివ్వట్లేదు. పస్తులుండి పనిచేస్తున్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని పోరాడుతున్న కార్మికులకు అరకొరగా ఇస్తున్న వేతనాలైనా నెల నెలా రాని పరిస్థితి ఉంది. నాలుగు నెళ్లుగా వేతనాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేతనాలు రాకపోయినా సదుపాయాల్లేకపోయినా నిరంతరం ప్రజలకు సేవ చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు వేతనాల కోసం రోడ్లెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది.కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు చేశారు. ఇవన్నీ నెరవేర్చాల్సిన కొత్త ప్రభుత్వం కనీసం పాత వేతనాల్ని కూడా ఇవ్వడంలేదు. పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందని సీఐటీయూ నాయకులు స్పష్టం చేస్తున్నారు.

- 4 నెళ్లుగా జీతాల్లేవు
- ప్రజలకు నిరంతర సేవలు
- ఇచ్చే అరకొర జీతం నెల నెలా అందని వైనం
- వేతనాల కోసం రోడ్లెక్కుతున్న జీపీ వర్కర్లు
- గుర్తింపు కార్డులు, సదుపాయాలు కరువు
- పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 1615 గ్రామ పంచాయతీలున్నాయి. సంగారెడ్డిలో 647, సిద్దిపేటలో 499, మెదక్ జిల్లాలో 469 గ్రామ పంచాయతీలున్నాయి. మేజర్, మైనర్ గ్రామ పంచాయతీల్లో సగటున పది నుంచి 15 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 20 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులున్నారు. గ్రామాల్లో మంచినీటి సరఫరా, వీధులైట్లు, పరిసరాల పరిశుభ్రత కోసం చెత్త రోడ్లు ఊడ్చడం, చెత్త ఎత్తడం, మురుగు కాల్వలు శుభ్రం చేయడం వంటి పనుల్ని కార్మికులు చేస్తున్నారు. గ్రామాల్లో నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలు చేస్తున్నారు. కార్మికుల శ్రమ ఫలితంగా ఉమ్మడి మెదక్ జిల్లాల్లో అనేక గ్రామ పంచాయతీలు స్వచ్ఛ ఆవార్డులకు ఎంపికయ్యాయి. గ్రామ పంచాయతీ పనులతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని కూడా వీరితోనే పనులు చేయిస్తున్నారు.

4 నెళ్లుగా వేతనాల్లేవు

గ్రామ పంచాయతీ కార్మికులకు నాలుగు నెళ్లగా వేతనాలు అందట్లేదు. అనేక పోరాటాల ఫలితంగా కార్మికులకు రూ.9500 వేతనం ఇస్తున్నారు. గ్రామ పంచాయతీలకు పాలక వర్గాల పదవి కాలం ముగిసింది. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. సర్పంచ్‌లున్నప్పటి కంటే అధికారుల పాలనలో కార్మికులకు అధికంగా పనులు చేయిస్తున్నారు. పారిశుధ్య వారోత్సవాల పేరిట కార్మికులతో అదనపు పనిచేయిస్తున్నారు. ప్రజలకు వివిధ రకాల సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు అందకపోవడంతో పస్తులుండి పనిచేస్తున్నారు. పంచాయతీ కార్మికుల్లో అత్యధికులు దళితులు, గిరిజనులు, బీసీలు, మహిళలే అధికంగా ఉన్నారు. వీరంతా కూడా ఏన్నో ఏళ్లుగా పంచాయతీల్లో సేవలందిస్తున్నారు. కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు నెల నెలా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల అప్పులు చేయాల్సి వస్తుంది. అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మాత్రం నెల నెలా జీతాలు తీసుకుంటున్నారు. బండ చాకిరి చేస్తున్న కార్మికులకు మాత్రం మూడునాలుగు నెళ్లగా వేతనాలివ్వట్లేదు. దీంతో కార్మికులు రోడ్డెక్కి వేతనాల కోసం కొట్లాడాల్సి వస్తుంది.

పనికి తగిన వేతనం కోసం కొట్లాట

పంచాయతీల్లో కష్టపడి పనిచేస్తున్న కార్మికులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని ఎప్పటి నుంచో కొట్లాడుతున్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాల్లో పోరాటాలు చేశారు. గత ప్రభుత్వం కార్మికులకు వేతనాలు పెంచడంతో విఫలం చెందింది. పంచాయతీల్లో రోడ్లన్నీ ఊర్చి చెత్త ఎత్తిపోయడం, కళేభలాలను ఎత్తివేయడం, మురికి కాల్వల్లోకి దిగి శుభ్రం చేయడం, మ్యాన్‌హోల్స్ జామ్ అయితే వాటిల్లోకి దిగి శుభ్రం చేయడం వంట పనులు చేయడానికి ఎవరూ ఇష్టపడరు. సమాజం పట్ల బాధ్యత ఎరిగిన సామాజిక వర్గాలకు చెందిన వాళ్లే పంచాయతీల్లో ఇలాంటి పనుల్ని చేస్తున్నారు. పల్లెలు, పట్నాలు పరిశుభ్రంగా ఉంటున్నాయంటే కార్మికుల శ్రమ ఫలితమే అయినప్పటికీ వేతనాలు, సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వాలు ఇష్టపడట్లేదు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. పీఎఫ్, ఇఎస్ఐ, రూ.10 లక్షల ప్రమాద బీమా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. గుర్తింపు కార్డులు, సబ్బులు, టవల్స్, యూనిఫామ్స్ కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. అర్హుతల్ని పట్టి పర్మినెంట్ చేయాలని కార్మికులు కొట్లాడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదు.

పెండింగ్ వేతనాలివ్వాలి: సీఐటీయూ

గ్రామ పంచాయతీ కార్మిలకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జి.సాయిలు, మెదక్ జిల్లా కోశాధికారి కడారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూడునాలుగు నెళ్లుగా వేతనాల్లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వేతనాలు పెంచుతామని చెప్పిన ప్రభుత్వం కనీసం పాత వేతనాలను నెల నెలా ఇవ్వని పరిస్థితి ఉందన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందన్నారు. కొత్త ప్రభుత్వం సైతం గత ప్రభుత్వం మాదిరే కార్మికుల పట్ల నిర్లక్షంగా వ్యవహారిస్తే పోరాడాల్సి వస్తుందన్నారు.



సాయి జ్యోతినగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లోని సాయిజ్యోతినగర్ కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. బుధవారం అధికారులతో కలిసి కాలనీలో ఆమె పర్యటించారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ సమస్య అధికంగా ఉందని ఈ సందర్భంగా కాలనీ మహిళలు, కమిటీ సభ్యులు కార్పొరేటర్ కు తెలపడంతో, జలమండలి మేనేజర్ జనార్ధన్ మరియు వారి సిబ్బందితో కలిసి కాలనీలోనీ వీధులను కార్పొరేటర్ సందర్శించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రయినేజీ సమస్య పరిష్కారానికి వెంటనే అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నూతన డ్రయినేజీ పైప్‌లైన్‌తో పాటు అనంతరం సీసీరోడ్ నిర్మాణ పనులను సైతం చేపడుతామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు వెంకట్ రెడ్డి, నర్సింహా రెడ్డి, పెంటయ్య రవి, సత్తయ్య గౌడ్, భూపాల్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ కట్టడాలపై అధికారుల కొరడా

12 ఇళ్ళు జెసిబిలతో ధ్వంసం

నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు గ్రామంలో గల సర్వే నంబర్ 297లో అక్రమ నిర్మాణాలను అధికారులు బుధవారం నేలమట్టం చేశారు. వివరాల్లోనికి వెళ్తే కొల్లూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 297లో కొందరు అక్రమంగా ప్రభుత్వ స్థలంలో కట్టడాలు చేపడుతున్నారనే విషయం అధికారుల దృష్టికి రావడంతో బుధవారం తహసిల్దార్ సంగ్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, సీఐ రవీందర్‌రెడ్డి, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు అక్రమ కట్టడాల వద్దకు వెళ్లి 12 ఇండ్లను జెసిబి లతో నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రభుత్వ స్థలంలో కబ్జాలకు పాల్పడితే వారు ఎంతటి వారైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రభుత్వ స్థలాలను కాపాడుకునేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ విశ్వేశ్వర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రాథోడ్, ఎస్ఐలు, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కాసాల మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-హత్నూర



తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాసాల మాజీ సర్పంచ్ పెండే యాదయ్య(55) అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన యాదయ్యను కుటుంబీకులు హైదరాబాద్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. అక్కడ గత వారం రోజులుగా చికిత్స పొందిన ఆయన మంగళవారం అర్ధరాత్రి సమయంలో మరనించారు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆదర్శ పాలనను అందించిన యాదయ్య మృతి పట్ల గ్రామస్తులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

మార్పుకనుగుణంగా అభివృద్ధి

ప్రతిష్టాపన మహోత్సవంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి

వీరాపూర్ లో అభివద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-బెజ్జంకి

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.బుధవారం పాపన్నపల్లిలోని హనుమాన్ ఆలయం వద్ద శివపంచాయత, ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన మహెూత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆరే క్షత్రియ సంఘం నాయకులు ఎమ్మెల్యేను శాలువ కప్పి ఘనంగ సన్మానించారు. అంతకుముందు వీరాపూర్ గ్రామంలో రూ.5 లక్షల నిధులతో చేపట్టనున్న వడ్రంగి కులస్తుల సామూహిక భవన ప్రహరీ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. బేగంపేట గ్రామ ఎంపీటీసీ పోతిరెడ్డి స్రవంతి దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు.నాయకులు ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఒగ్గు దామోదర్,పులి కృష్ణ చిలువేరు శ్రీనివాస రెడ్డి, అక్కరవేణి పోచయ్య,మంకాల ప్రవీన్,శానకొండ శరత్,జ నాగం శంకర్,రంగోని రాజు,ఐలేని శ్రీనివాస్ రెడ్డి,రావుల నర్సయ్య, వడ్లకొండ శ్యామ్,అయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు హజరయ్యారు.

మొక్కులు చెల్లించిన కవ్వంపల్లి అభిమాని ..

మానకొండూర్ నియోజవర్గ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ ఎన్నికవ్వడంతో బేగంపేట గ్రామ హనుమాన్ ఆలయం వద్ద కవ్వంపల్లి అభిమాని వెన్నం రాజు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నాడు. అభిమాని రాజును ఎమ్మెల్యే కవ్వంపల్లి అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

మండల కేంద్రానికి చెందిన బోనాల ఉదయ్ ఆనారోగ్య కారణంతో మృతి చెందిన విషయం విధితమే.సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి మృతుని కుటుంబ సభ్యలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శలో స్థానిక కాంగ్రెస్ శ్రేణులు అయన వెంట ఉన్నారు.



పనిచేసినా డబ్బులు రావడం లేదు

డిబిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు

నవతెలంగాణ-రాయపోల్



ఉపాధి హామీ పథకంలో సంవత్సరం,రెండు సంవత్సరాల క్రితం పనిచేసిన కూలీలకు డబ్బులు రావడం లేదని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. బుధవారం రాయపోల్ మండలంలో అరేపల్లె, రాంసాగర్,కొత్తపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలు ఎండకు ఎండి చేతులకు పొక్కులు వచ్చేటట్టు చేసిన పనులకు సంవత్సరాలు గడుస్తున్నా వేతనాలు రాలేదని కూలీలు కష్టాలు వెల్లడించారు. అరేపల్లిలో రెండు సంవత్సరాల క్రితం ఏడు వారాలు 50 మంది కూలీలు చెరువులో పనిచేస్తే ఇంత వరకు కొంత మంది కూలీలకు వేతనాలు అందలేదన్నారు. అలాగే రాంసాగర్ లో సంవత్సరం క్రితం దండు ఆంజనేయులు, సత్యనారాయణ,ముత్యాలు సంవత్సరం క్రితం చెరువులో పనిచేసినా పైసలు రాలేదన్నారు.అలాగే కొత్తపల్లిలో కూడా సంవత్సరం కింద చేసిన డబ్బులు కూలీలకు అందలేదన్నారు. ప్రస్తుతం ఈ సంవత్సరంలో కొత్తపల్లిలో ఆరువారాల నుండి 40 నుండి 50 మంది కూలీలు చేస్తున్న వారికి డబ్బులు రాలేదన్నారు.కూలీలతో మాట్లాడిన అనంతరం రాయపోల్ టెక్నికల్ అసిస్టెంట్ తో కూలీలు చెప్పిన విధంగా అడిగితే సంవత్సరం రెండు సంవత్సరాల పెండింగ్ డబ్బులు ఏవి లేవని అధికారి చెప్పారు. కూలీలు మాత్రం మాకు డబ్బులు రాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా విచారణ జరిపి కూలీలకు సంవత్సరం రెండు సంవత్సరాల డబ్బులు పెండింగ్లో ఉన్న డబ్బులు చెల్లించాలని కూలీల తరపున డిమాండ్ చేశారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



మండలంలోని పలు గ్రామాలలో బుధవారం జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో మండల ప్రత్యేక అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మండలంలోని ఇంద్రేశం గ్రామం రాయల్ కాలనీలో ఇంద్రేశం కాజా మాజీ ఉపసర్పంచ్ శివకుమార్ గౌడ్ రూ.40 లక్షల సొంత నిధులతో అంతర్గత సిసి రహదారులకు అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో కాలనీలో తిరగాలంటే ఇబ్బందికరంగా ఉండేదని అడగగానే స్పందించిన శివ కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీవాసుల కోరిక మేరకు సొంత నిధులను వెచ్చించి సీసీ రోడ్డు వేయించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంద్రేశం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారికి పి.ఉష, పంచాయతీ కార్యదర్శి సుభాష్, ఎంపీటీసీ మనెమ్మ. తాజా మాజీ సర్పంచ్ నరసింహులు.గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పనుల సమర్థవంతంగా నిర్వ హించాలి



నవతెలంగాణ-తొగుట

ఉపాధి హామీలో పనులను సమర్ధవంతంగా నిర్వహించాలని సామాజిక తనిఖీ డిర్డిఓ బాలకృష్ణ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో డిర్డిఓ అధ్వర్యంలో 14 వ సామా జిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమర్ధవంతంగా పని చేసిన టిఏ, ఎఫ్ఏ లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్ముందు గ్రామంలో ఉపాధి హామీలో నిర్వహించే పనులపై ప్రజలకు అవగాహన కల్పించి సమర్థవంతంగా నిర్వహిం చాలని, టీఏ, ఎఫ్ఏలను, స్థానిక ప్రజా ప్రతినిధుల ను కోరారు. పలు గ్రామంలో జరిగిన అవకతలపై రూ. 68,467 వ్యయం జరిమానా విధిచినట్టుగా తెలి పారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శ్రీధర్ ను ఎంపీపీ సిబ్బంది ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసి వేల్పుల స్వామి ముది రాజ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంపీఓ చంద న, ఏపీఓ కిషన్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ పాటించకపోవడంతోనే చిరంజీవి బహిష్కరణ

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్



క్రమశిక్షణ, నైతిక విలువలు పాటించకపోవడంతోనే చిరంజీవిని సీఐటీయూ నుంచి బహిష్కరించినట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. నారాయణఖేడ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సాయిలు మాట్లాడుతూ.. ఇటీవలే ఖేడ్‌లో జరిగిన సీఐటీయూ సమావేశంలో చిరంజీవిని బహిష్కరించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్టు చెప్పారు. గతంలోనే సీఐటీయూ నుంచి ఆయన్ను తొలగించినప్పటికీ.. ప్రస్తుతం ప్రజాసంఘాల నుంచి బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఇకనుంచి సీఐటీయూ, ప్రజా సంఘాలతో చిరంజీవికి ఎటువ ంటి సంబంధం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు నరసింహులు, సతీష్, సంతోష్, గణపతి పాల్గొన్నారు.

'పేదల సాధికారతలో డిజిటల్ ఇండియా పాత్ర'పై సెమినార్



నవతెలంగాణ-పటాన్‌చెరు

గ్రామీణ ప్రాంతాల్లోని పాలనపై డిజిటల్ ఇండియా ప్రభావం, తెలంగాణలో అన్వేషణాత్మక అధ్యయనం అనే అంశంపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఒకరోజు సెమినార్‌ను నిర్వహించినట్టు ప్రాజెక్టు డైరెక్టర్ గీతం అధ్యాపకుడు డాక్టర్ గుర్రం అశోక్ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) సౌజన్యంతో దీనిని నిర్వహించినట్టు తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలోని నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్హెచ్ఎస్) డీన్ ప్రొఫెసర్ కామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని, అట్టడుగు స్థాయిలో డిజిటల్ ఇండి యాపై విధాన పరిశోధన ఆవశ్యకతను నొక్కిచెప్పారన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జీఎస్హెచ్ఎస్ డైరెక్టర్ సన్నీ జోస్ వర్క్‌షాప్‌కు హాజరైన అతిథులను స్వాగతించినట్టు తెలిపారు. అట్టడుగు వర్గాలను సాధికారపరచడంలో డిజిటల్ ఇండియా యొక్క సామర్థ్యాన్ని మౌలానా అబ్దుల్ కలాం ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ నిషింకాంత్ కోల్గే ప్రముఖంగా ప్రస్తావించడంతో పాటు ఇటు వంటి కార్యక్రమాలకు మహాత్మా గాంధీ మద్దతు గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారన్నారు. గ్రామీణ తెలంగాణాలో లింగ భేదం, డిజిటల్ టెక్నాలజీలపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ షీలా సూర్యనారా యణన్ లోతైన అవగాహన కల్పించినట్టు పేర్కొ న్నారు. ప్రాజెక్టు డైరెక్టర్ హెూదాలో తాను పరిశోధనా ఫలితాలను, అధ్యయనం సిఫారసులను సమర్పించగా, వాటిపై చర్చకు బిట్స్ హైదరాబాద్ ప్రొఫెసర్ భీమేశ్వరెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి చిట్టేడి రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించినట్టు తెలిపారు. దీనికి అదనంగా నలుగురు ప్రతివాదులు, క్షేత్రస్థాయి పరిశీలకులు ఈ కార్యశాలలో పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నట్టు వెల్లడించారు. గీతం అధ్యాపకులు, విద్యార్థులు పలువురు ఈ సెమినార్‌లో చురుకుగా పాల్గొని విజయవంతం చేసినట్టు ఆయన వివరించారు.

లోక్ అదాలత్ కోసం సమన్వయ సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.ప్రభాకరరావు అధ్యక్షతన బుధవారం సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె.హనుమంతరావు మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కోసం ఇన్సూరెన్స్ అధికారులతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె. ప్రభాకర రావు మాట్లాడుతూ.. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, రాజీపడే అన్ని కేసులను త్వరితంగా పరిష్కారం అయ్యే విధంగా.. ఎక్కువ సంఖ్యలో కేసులు పరిస్కరించేలా కృషి చేయాలన్నారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్సూరెన్సు అధికారులు, అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోవడం దురదృష్టకరం

నవతెలంగాణ-పుల్కల్



పుల్కల్ మండల కేంద్రంలో మంగళవారం రోజున జరిగిన సీసీరోడ్ల శంకుస్థాపనలో ప్రోటోకాల్ పాటించకపోవడం దురదృష్టక రమని ఎంపీటీసీ శ్రీనివాస్ చారి వాపోయారు. ఎంపీటీసీ పదవీకాలం ఇంకా నాలుగు నెలలు ఉన్నప్పటికీ.. తమకు ఏమాత్రం సమాచారం ఇవ్వకపోవడం ఎంతవరకు సమం జసమని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తమకు ఎలాంటి సమా చారం ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులే ప్రారంభోత్సవాలు చేసుకోవడం ఎంతవరకు సమంజస మని ప్రశ్నించారు. కనీస ప్రోటోకాల్ నిబంధనలు పాటించకుండా ఈజీఎస్ నిధుల కింద రూ.15 లక్షలతో మంజూరైన సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు సరికాదన్నారు. ఇకముందు ఇలాంటి తప్పులు జరగకుండా గ్రామంలో జరిగే ఏ అభివృద్ధి పనులకైనా ప్రోటోకాల్‌ను పాటించాలన్నారు.

ఉమెన్స్ టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరకాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సంగారెడ్డి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో నెలరోజుల పాటు గ్రామీణ మహిళలకు ఉమెన్స్ టైలరింగ్‌లో ఉచిత శిక్షణను మార్చి 4 నుంచి ప్రారంభిస్తున్నట్టు ఎస్‌బీఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 నుంచి 45ఏండ్లలోపు మహిళలకు ఉచిత భోజనం,వసతితోపాటు.. ఉచితంగా శిక్షణ, టైలరింగ్ టూల్ కిట్ ఇవ్వనున్నట్టు తెలిపారు. రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్, పదో తరగతి క్లాస్ మెమో, జిరాక్సు లతో పాటు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు జత చేయాలన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు 9490103390, 9490129839 లను సంప్రదించాలన్నారు. మార్చి 2 దరఖాస్తులకు చివరి తేదీ అని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పంటల పుష్టి పంచగవ్య పై అవగాహన

నవతెలంగాణ-వట్‌పల్లి

ఆందోల్ నియోజకవర్గంలోని సంగుపేట ఏరువాక కేంద్రం వ్యవసాయ విశ్వవిద్యాలయం రావా పే విద్యార్థులు వట్‌పల్లిలోని పంట పొలాల వద్ద ప్రయోగాత్మకంగా పుష్టి పంచగవ్యపై రైతులకు అవగాహన కల్పించారు. పంచగవ్యలో తొమ్మిది ఉత్పత్తులు.. ఆవు పేడ, మూత్రం, పాలు, పెరుగు, నెయ్యి, బెల్లము, అరటిపండు, లేత కొబ్బరి నీరు తగిన విధంగా కలిపి ఉపయో గించినప్పుడు ఇవి అద్భుతమైన ఫలితాలను అందిస్తాయన్నారు. ఆవు పేడ ఏడు కిలోలు, ఆవు నెయ్యి ఒక కిలోను పైన పేర్కొన్న తొమ్మిది పదార్థాలను ప్రతీ ఉద యం, సాయంత్రం బాగా కలిపి మూడ్రోజులపాటు అలాగే ఉంచినతే పంచగవ్య సిద్ధంగా అవుతున్నట్టు వారు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో శివ, మోహన్, వికాస్, అమన్, ప్రశాంత్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



వెలుగులు నింపేందుకే ఐమాక్స్ లైట్స్

నవతెలంగాణ-ఝరాసంగం

గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద వెలుగులు నింపేందుకే నూతనంగా ఐమాక్స్ లైట్స్ ప్రారంభించినట్టు ఎంపీటీసీ సంగీత-గుండప్ప అన్నారు. మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో బుధవారం రూ.రెండు లక్షల ఎంపీటీసీ నిధులతో ఐమాక్స్ లైట్స్ ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలు గ్రామ అభివృద్ధికి సహకరించాలని వారు విన్నవించారు. ఈ కార్య క్రమంలో వార్డు సభ్యులు అంజ ద్, శేఖర్, గ్రామస్తులు శంకర్, రామయ్య, ప్రభు, బాబు మియా, ఖాయుం, నర్సప్ప, నర్సింలు, దత్తు, వీర్శెట్టి పాల్గొన్నారు.



జోగుపేట నుంచి అయోధ్య రామ మందిరానికి..

నవతెలంగాణ-జోగిపేట

అయోధ్య శ్రీరామ మందిర దర్శన అభియాన్‌లో భాగంగా బుధవారం ఆందోల్ నియోజకవర్గం పరిధిలోని భక్తులు జోగిపేట నుంచి యాత్రకు బయలుదేరి వెళ్లారు. జోగిపేట వీర హనుమాన్ మందిర్ నుంచి హనుమాన్ చాలీసా పారాయణం చేసిన తర్వాత జోగిపేట నుంచి పప్పుతిహనుమాన్ వరకు భజన చేసుకుంటూ ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు ముత్తిరెడ్డి నరసింహారెడ్డి, ఆందోల్ అసెంబ్లీ కన్వీనర్ మఠం చంద్రశేఖర్, అందోల్ అసెంబ్లీ కోకన్వీనర్ మహేష్ కర్ సుమన్, పుల్కల్ మండల అధ్యక్షులు కుమ్మరి పండరి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నేరేడుగుంటలో ఘనంగా శ్రీ దుర్గా విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-జోగిపేట

మండల పరిధిలోని నేరేడుగుంట గ్రామంలో బుధవారం శ్రీ దుర్గా విగ్రహ ప్రతిష్టాపన, శివ పంచాయతన, ఆంజనేయ ధ్వజ శిఖర స్థర ప్రతిష్టాపన మహోత్సవాన్ని గ్రామ మాజీ సర్పంచ్, ఆలయాల నిర్మాణ దాత మైలు గుండ్ల చందులత, వీరు మల్లప్ప, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పూజారి రాము పంతులు సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మాధవానంద సరస్వతి స్వామి దివ్య హస్తములతో యంత్రస్థాపన, అభిషేకం, అలంకరణ, ప్రాణ ప్రతిష్ట, బలి, నేత్రోని లనము, పూర్ణాహుతి, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్ర మానికి గ్రామంలోని ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున హాజర య్యారు. గత రెండు రోజులుగా గ్రామంలో వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, అందోల్ ఎంపీపీ బాలయ్య, ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపా ధ్యక్షులు నారాయణ, ఎంపీటీసీ కృష్ణా గౌడ్, మాజీ సర్పంచ్ లు జగన్మోహన్ రెడ్డి, డప్పు రామచందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శివరాజ్, మాజీ ఎంపిటిసి రాజు రెడ్డి, నాయకులు శ్రీధర్ రెడ్డి, గాల్ రెడ్డి, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రరాళ్ల తవ్వకాలపై మెరుపు దాడులు

నవతెలంగాణ-న్యాల్‌కల్

గణేష్‌పూర్ గ్రామ శివారులో గతంలో నిలిచిపోయిన ఎర్రరాయి తవ్వకాలు మళ్ళీ ప్రారంభమైనట్టు సమాచారం రావడంతో.. మండల రెవెన్యూ అధికారులు తహసీల్దార్ భాను కిరణ్, నాయబ్ తహసిల్దార్ రాజిరెడ్డి ఆకస్మిక దాడులు నిర్వహించారు. మట్టి టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని రూ.5000 జరిమానా విధించినట్టు అధికారులు తెలిపారు.

గుట్టుగా తెచ్చి.. గుట్టలుగా పోసి

ఆసానికుంట వద్ద పారిశ్రామిక వ్యర్థాల పారబోత

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న స్థానికులు



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

గుట్టలుగా పేరుకుపోతున్న పరిశ్రమ వ్యర్థాల కంపుతో ఆసానికుంట చుట్టు పక్కన ఉన్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా పరిశ్రమ వ్యర్థాలను అర్ధరాత్రి పూట డీసీఎం, లారీలు, ట్రాక్టర్లలో తీసుకువచ్చి ఆసానికుంట, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు, ప్రధాన రహదారుల వెంట ఇష్టారాజర్యంగా పారబోస్తున్నారు. అంతేకాకుండా కొందరు నిర్మాణ వ్యర్థాలను సైతం తీసుకువచ్చి యథేచ్ఛగా కుమ్మరిస్తున్నారు. ఈ పారిశ్రామిక వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాలు మట్టికుప్పలు, గుట్టలుగా పేరుకుపోతున్నాయి. దాంతో స్థానిక ప్రజలతోపాటు.. ఆ రోడ్డుగుండా ప్రయాణించే వాహ నదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతు న్నా అధికారులు కనీసచర్యలు చేపట్టకపోవడం శోచనీయం.

పరిశ్రమ వ్యర్థాలను హైదరాబాద్ వేస్ట్ మేనేజ్మెంట్‌కు తరలించాలని ఉన్నప్పటికీ.. వ్యయంతో కూడిన వ్యవహారం కావడంతో స్థానికంగా ఉండే కొందరికీ ఎంతోకొంత ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వారి నిర్లక్ష్యంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలను పారబోస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మా దృష్టికి వస్తే జరిమానా విధిస్తాం

పారిశ్రామిక వ్యర్థాలు పారబోస్తే కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం అందిస్తాం. నిర్మాణ వ్యర్థాలు పారబోస్తే ఆ పరిశ్రమలను గుర్తించి ఉన్నతాధి కారుల ఆదేశాలతో తగిన జరిమానా విధిస్తాం. అన్ని పరిశ్ర మలకు వ్యర్థాలను బయట పారబోయవద్దని తెలియజేశాం.

-వినోద్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ధూపదీప అర్చక సంఘం

నవతెలంగాణ-సదాశివపేట

2023లో నూతనంగా ఎన్నికైన ధూపదీప నైవేద్య అర్చకులకు మరియు పాత అర్చకులకు సంబంధించి బకాయి డబ్బులను విడుదల చేయడం పట్ల ముఖ్యమంత్రికి అర్చక సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంగారెడ్డి జిల్లా ధూపదీప అర్చక సంఘం సదాశివపేట లోని అర్చకులు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, దేవాదాయశాఖ మంత్రి కొండ సురేఖకు, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేణుగో పాలరావుకు, దేవదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధూపదీప నైవేద్య అర్చక సంఘం సంగారెడ్డి జిల్లా కోశాధికారి జంగం మహేష్, నిర్వాహకులు మహేష్ స్వామి, శివకోటి స్వామి, మల్లికార్జున స్వామి, భూషణం స్వామి పాల్గొన్నారు.



దళిత క్రైస్తవులు, చర్చీల మీద దాడుల్ని అరికట్టాలి

నవతెలంగాణ-జహీరాబాద్

దళిత క్రైస్తవులు, చర్చీలపై జరుగుతున్న దాడులను తక్షణమే అరికట్టాలని డీఎస్ఎం జిల్లా అధ్యక్షులు హేమానంద్ అన్నారు. జహీరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల శంకర్పల్లి మండలం జనవాడ గ్రామంలో మెథడిస్ట్ చర్చ్ మీద, అక్కడి దళిత క్రైస్తవుల మీద ఆర్ఎస్ఎస్ మూకలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, తెలంగాణాలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుక ోవాలని దళిత్ సాలిడారిటీ మూవ్మెంట్ సంగారెడ్డి జిల్లా కమిటీ తరపున ఆర్‌డీఓ వినతి పత్రం అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎంఎస్ ఉపాధ్యక్షులు ప్రదీప్, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి మోహన్, సలహా దారులు ధన్ రాజ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో నీడ కరువు

ఎండకు మాడుతున్న కూలీలు

నీటి సౌకర్యం లేకపోవడంతో.. ఇంటి నుంచే బాటిళ్లలో నీళ్లు

నవతెలంగాణ-కొండాపూర్



గత కొన్ని రోజులుగా ఎండలు విజృంభిస్తున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు ప్రతీ ఊర్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దాంతో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. నిప్పులు కురుస్తున్నట్టు ఉన్న ఎండలోనే నానా అవస్థలు పడ ుతూ పనులు చేస్తున్నారు. అయితే వారికి పనిచేసే చోట టార్పాలిన్ పట్టాలు వేసి నీడ కల్పించడంతో పాటు నీటి సౌక ర్యం కల్పించాలి. మండలంలో ఒకటి రెండు చోట్ల మినహా.. మిగిలిన ఎక్కడా ఆ నిబంధనలు పాటించడం లేదు. దాంతో ఎండలోనే తీవ్ర ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నారు.

ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు జరుగుతున్నాయి. అయితే ఎండలు విపరీతంగా ఉండడంతో.. కూలీలు ఎండ దెబ్బకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పనులను పర్యవేక్షిస్తున్న ఉపాధి సిబ్బంది కూలీలకు నీడ ఏర్పాటు చేసే విషయంపై తగిన శ్రద్ధ చూపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణంగా ఉపాధి కూలీలకు ప్రతిరోజూ నీళ్ళకు ఐదు రూపాయలు, తట్టబుట్టకు మూడు రూపాయలు, గడ్డపారకు పదిహేను రూపాయలు ఇచ్చేది. అయితే ప్రస్తుతం ఇవి ఇవ్వడం లేదు. పని అంచనాలో మాత్రం వీటితో కలిపి పంపుతున్నారు. ఈ చార్జీలకు సంబంధించి సిస్టమ్‌లో ఆప్షన్‌ను తీసేశారు. దాంతో ఈ బిల్లు కూలీలకు అందడం లేదు.వ ండల వ్యాప్తంగా చేపల చెరువులు, చెరువులు, చెక్‌డ్యాంలు, పశు వులకు నీటికుంటలు పూడికతీత పనులు, గుట్టలు, కొండల్లో కందకాల తవ్వకం పనులు జరుగుతున్నాయి. కూలీలకు నీడ సౌకర్యం కోసం 5 శ్రమశక్తి సంఘాలకు కలిపి ఒక టార్పాలిన్ పట్టాను గ్రామానికి ఒక మెడికల్ కిట్‌ను అందజేసింది. అయితే క్షేత్రస్థాయిలో ఒకటి రెండుచోట్ల మినహా.. మరెక్కడా కూలీలకు నీడను కల్పించే ప్రయత్నం చేయట్లేదు. అంతేకాకుండా దాహార్తిని తీర్చడానికి మంచినీటిని కూడా ఏర్పాటు చేయకపోవడంతో.. కూలీలు ఇంటివద్ద నుంచే బాటిళ్లలో నీళ్ల తెచ్చుకుంటున్నారు.

సమస్యల పరిష్కారానికి నేరుగా సంప్రదించండి

నవతెలంగాణ-జహీరాబాద్



సమస్యల పరిష్కారానికి నేరుగా రెవెన్యూ కార్యాల యాలను సంప్రదించాలని జహీరాబాద్‌లో ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ రాజు అన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాల యంలో విలేకరులతో ఆయ న మాట్లాడుతూ.. ఇంతకు ముందు హుజురాబాద్‌లో ఆర్డీఓగా విధులు నిర్వ హించి బదిలీపై ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. కాగా 2007లో కరీంనగర్ జిల్లాలోని జగిత్యాలలో నాయబ్ తహసీల్దారుగా ఉద్యోగం పొంది.. 13 ఏండ్లు అదే జిల్లాలోని వివిధ మండలాల్లో తహసీల్దార్‌గా కూడా బాధ్యతలు చేపట ్టినట్టు గుర్తు చేశారు. నిరుపేద కుటుంబంలో నుంచి వచ్చిన తనకు.. రెవెన్యూ సమస్యల గురించి బాగా తెలుసనని.. కాబట్టి వారి పరిష్కరిస్తానన్నారు. ఇప్పటికే జహీరాబాద్ ఆర్డిఓ పరిధిలోని తహసీల్దార్‌లతో సమావేశాన్ని నిర్వహించి విద్యార్థులకు కావాల్సిన వివిధ ధ్రువీకరణ పత్రాలకు తక్షణమే అందజేయాలని, రిజిస్ట్రేషన్‌లను ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించినట్టు చెప్పారు. కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి చట్టానికి అనుగుణంగా ప్రభుత్వ శాఖలకు నేరుగా పంపించాలని అధికారులకు సూ చించామన్నారు. పలు అంశాలను తమ దృష్టికి వచ్చాయని.. వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

ఎండకాలంలో తాగునీటి సమస్య రానివం

ఎంపీడీవో మహేందర్ రెడ్డి

నవతెలంగాణ-జహీరాబాద్



గ్రామాల్లో తిష్ట వేసిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్య తనిచ్చి.. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో మహేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాటా ్డుతూ.. నల్గొండ జిల్లా నుంచి జహీరాబాద్‌కు ఇటీవలే బదిలీపై వచ్చానని.. రాగానే ఇక్కడి పలు సమస్యలను తెలుసుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో సర్పంచ్లు లేని కారణంగా ప్రత్యేక అధికారుల పాలన కొనసా గుతుందని.. ఈ సమయంలో రానున్న వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగ జాగ్రత్తలు తీసుక ుంటున్నట్టు చెప్పారు ఓ కమిటీని వేసి.. ప్రతీ సోమవారం ఫిర్యాదులు స్వీకరించి ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరి స్తామన్నారు. ఇప్పటికే ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్ష నిర్వహించగా.. వారు పలు సూచనలు చేశారన్నారు. వాటిని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పైప్ లైనింగ్ మరమ్మత్తులు, ట్యాంకుల పారిశుద్ధ్యం లాంటి కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్య దర్శులు ప్రతిరోజు గ్రామంలో అందుబాటులో ఉండాలని.. లేనిపక్షంలో వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని ప్రజలందరి దగ్గరకు చేర్చేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే ప్రజలకు నేరుగా తనను సంప్రదించాలన్నారు.

కుల మతాలకతీతంగా ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలో గల ప్రఖ్యాతి గాంచిన ఉర్సె షరీఫ్ హాజరాత్ పీర్ గైబ్ సాహెబ్ ఉత్సవాలలో భాగంగా పీర్ గైబ్ సాహెబ్ దర్గాకు న్యాల్కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్ చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా జరిగే ఈ జాతర ఉత్సహాలు జిల్లాలోనే ఎంతో ప్రత్యేకత చాటుకున్నాయన్నారు. వారం రోజులుగా జరిగే ఉత్సవాలలో తెలంగాణతో పాటు మహా రాష్ట్ర మరియు కర్ణాటక రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారన్నారు. ఇక్కడ జరిగే మల్లయోధుల కుస్తీ పోటీలకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నదన్నారు. దినదినం ఎంతో ప్రఖ్యాతిని గాస్తున్న ఈ దర్గా ఉత్సహాలు రాబోయే రోజుల్లో మరింత ఘనంగా నిర్వహించేందుకు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ నిర్వా హకులు మాక్సూద్, బీఆర్ఎస్ మండల మైనార్టీ నాయకులు ఈసం పటేల్, నాయకులు శ్రీనివాస్, కుద్దుస్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో జిల్లా వ్యవసాయాధికారి తనిఖీలు



నవతెలంగాణ-పుల్కల్

మండల కేంద్రంలో ఉన్న పలు ఫర్టిలైజర్ షాపులను జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వరి పంట పొల ాలను క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. ప్రస్తుతం వరి పంటలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని.. కాబట్టి రైతులు కాం ్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జి గుళికలు ఎకరాకు 8 కిలోలు వేసు కోవాలన్నారు. లేదా ఫ్లోరస్ ట్రానిలిప్రోల్ 18.5 ఎస్‌సీ (క్లోం ్జిన్) 60ఎం.ఎల్ పిచికారి చేసుకోవాలన్నారు. ఉధృతి ఎక్కు వగా ఉంటే యూరియా వేయడం తగ్గించాలన్నారు. రైతు లను ఆసరాగా చేసుకొని ఫర్టిలైజర్ దుకాణ యజమా నులు అధిక ధరలకు పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏడీఏ అరుణ, పుల్కల్ మండల వ్యవసాయ అధికారి చైతన్య పాల్గొన్నారు.

పరిశ్రమలో కార్మికుడికి ప్రమాదం

పట్టించుకోని యాజమాన్యం

కార్మికుడికి అండగా నిలిచిన కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం పారిశ్రామికవాడలోని ఓ ప్రయివేటు పరిశ్రమలో గత జులై నుంచి బీహార్ రాష్ట్రానికి చెందిన జై.ప్రకాష్‌లాల్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. అయితే గత డిసెంబర్ 7న అతడు పరిశ్రమలో ప్రమాదానికి గురయ ్యాడు. యాజమాన్యం పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ నాయకుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచాడు. శనివారం కార్మికుడి తీసుకొని పరిశ్రమ యాజమాన్యంతో చర్చలు జరిపారు. దాంతో పరిశ్రమ యాజ మాన్యం కార్మికుడికి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చింది. కాగా ఆనంద్ కృష్ణారెడ్డి తన సొంత నిధుల నుంచి రూ.9వేలను కార్మికుడికి అంద జేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పొట్ట చేత పట్టుకొని ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు బొలా ్రానికి తరలివచ్చి వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారన్నారు. వారికి ఏదైనా ప్రమాదం జరిగితే యాజమాన్యం పట్టించుకోకపోతే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.



విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

నవతెలంగాణ-జోగిపేట

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలని అందోల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కే. సాయి ులత అన్నారు. 10 వ తరగతి, సీనియర్ ఇంటర్ విద్యార్థిని ులకు బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ పేద విద్యార్థినికి గురుకుల పాఠశాలలు వరం లాంటిదన్నారు. ప్రభుత్వ ఆశ యాన్ని సాధించే విధంగా జీవితంలో స్థిరపడాలని.. అంద ుకు ఏకైక మార్గం చదువు ఒక్కటేనన్నారు. ఇక్కడి స్పూర్తితో ఉన్నత చదువులను కూడా కష్టపడి చదివి మంచి స్థాయికి ఎదగాలన్నారు. జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని కఠిన శ్రమ, క్రమశిక్షణతో చదివితే, లక్ష్య సాధన సులభమౌతుం దన్నారు. ప్రిన్సిపాల్ సాయిలత, ఉపాధ్యాయినులను విద్యా ర్థునులు ఘనంగా సన్మానించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ సాయిలతను పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు విజయ్ కుమార్ దంపతులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ రత్న రాజు, వైస్ ప్రిన్సిపాల్ లు అజ్మత్ బేగం,స్వర్ణలత, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



డీలర్లు ఎరువుల కొరత లేకుండా చూడాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్
నవతెలంగాణ-మనోహరాబాద్



రైతులకు ఎరువుల కొరత లేకుండా డీలర్లు ఎప్పటి కప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ డీలర్లకు సూచించారు. బుధవారం తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఎరువుల దుకాణంలోని యూరియా, డీఏపి, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పి ఎరువుల నిల్వలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు ఇబ్బందులు కలగకుండా ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈపాస్ మిషన్ ద్వారానే రైతులకు ఎరువులను అమ్మకం చేయాలని సూచించారు. పీఎం కిసాన్ కొరకు రైతులు తప్పకుండా ఈకేవైసి చేసుకోవాలని సూచించారు. అలాగే వరి పంటలో మొగి పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ వ్యవసాయ అధికారి గంగమల్లు మరియు డీలర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్సీలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

డిఈఓ రాధా కిషన్
నవతెలంగాణ-పెద్దశంకరంపేట



ఎస్ఎస్సి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మెదక్ జిల్లా విద్యాధికారి రాధా కిషన్ అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన ఎస్ఎస్సి విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు మాథ్స్, సైన్స్, తెలుగు విషయాలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయాందోళనలు చెందవద్దని, ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారి వెంకటేశం, రాజేశ్వర్, విటల్, ప్రిన్సిపాల్ విఠల్ నాయక్, ప్రసన్నకుమార్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

పంచాయితీ కార్మికుల ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టవా

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి
సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, వినతి పత్రం అందజేత
నవతెలంగాణ-మెదక్





రెక్కాడితేగాని డొక్కాడని పంచాయతీ కార్మికులు మూడు నెలలుగా వేతనాలు అందక ఆకలితో అలమటిస్తుంటే ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు పట్టించుకోవడం లేదని సిఐటియు జిల్లా కోశాధికారి,గ్రామ పంచాయితీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కడారి నర్సమ్మ మండిపడ్డారు. బుధవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ రమేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత 3 నెలలుగా వేతనాలు చెల్లించడం పోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కష్టాన్ని నమ్ముకొని బతికే కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాలు ఏమి తిని బతుకుతారని ప్రశ్నించారు. ప్రభుత్వ అధికారులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయించే ప్రభుత్వం గ్రామ పంచాయితీ సిబ్బందికి మాత్రం వేతనాలు ఇవ్వడానికి మనస్సు రావడం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాలలో వర్కర్ల పై అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, మధ్యాహ్న భోజనానికి గంట సమయం ఇవ్వడం లేదని, భోజన సమయం కేటాయించాలన్నారు. గ్రామాల్లో సర్పంచులు కాల పరిమితి ముగిసిన తరువాత పాత కార్మికులను తొలగించి కొత్త వారిని పని పెట్టుకుంటున్నారని, కార్మికులను తొలగిస్తే ఊరుకోబోమని తెలిపారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతినెల కార్మికులకు సబ్బులు, నూనెలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయితీ జిల్లా కార్యదర్శి ఆసీఫ్, పంచాయతీ సంఘ సభ్యులు శేఖర్, పద్మారావు, సిద్ధిరాములు, సత్యం, ఎళ్ళం, సామెల్, లింగం, సాయిలు, నర్సింలు, మరియమ్మ, లక్ష్మయ్య, రాములు, సంతోష్, కిష్టయ్య, మరియమ్మ, స్వామి తదితరులు ఉన్నారు.

సింగూరు నీటి విడుదల

మంజీరా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
జిల్లా ఎస్పి బాలస్వామి
నవతెలంగాణ-మెదక్



సింగూరు నీటి విడుదల కారణంగా మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పి బాలస్వామి పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మాట్లాడుతూ... సింగూరు నీటి విడుదలతో సింగూరు నుంచి ఏడుపాయల మీదుగా మెదక్ జిల్లాకు నీటిని విడుదల చేయడంతో ఈ ప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లా పోలీసు శాఖ అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం సింగూరు నీటిని విడుదల చేస్తున్నందున ఏడుపాయలలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంతానికి ప్రజలు రాకుండా అవసరమైన కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. మంజీరా పరివాహక ప్రదేశాల్లో ఉన్న రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా పశువుల కాపరులు, గొర్రెల కాపరులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజల యోగక్షేమాల కోసం ఎల్లప్పుడూ పోలీస్ శాఖ పని చేస్తోందని తెలిపారు. తమ తమ పోలీస్ స్టేషన్‌ల పరిదిలలో డ్యామ్‌లు, చెరువులు, కుంటలు, అలుగులు పారే ప్రదేశాలను గుర్తించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అక్కడి పరిస్థితుల పై అధికారులకు తెలియజేయాలన్నారు. విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే డయల్ 100 కానీ దగ్గరలోని పోలీస్ స్టేషన్, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712657888 కు సమాచారం ఇవ్వాలన్నారు.

మొదటి భార్య అడ్డు వస్తుందని భర్తనే సుఫారీ హత్య

మెదక్ రూరల్ సిఐ కేశవులు
నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్



మొదటి భార్య అడ్డు తొలగించుకోవాలని ఇరవై వేలు ఇచ్చి తాళి కట్టిన ఇల్లాలిని భర్త హత్య చేయించాడు. ఈ ఘటన మండలంలోని తొగిట గ్రామంలో వారం రోజుల క్రితం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు మెదక్ రూరల్ సీఐ కేశవులు బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం హవేళి ఘనపూర్ మండలం తొగిటకు చెందిన మంద సంగమణి ఈ నెల 11 న అర్ధరాత్రి దారుణ హత్యకు గురైంది. మృతురాలు భర్త ఆశయ్యాకు సంగమని మొదటి భార్య కాగా రెండో భార్య మంజుల ఉంది. ఇద్దరి భార్యల మధ్య సంసారం విషయంలో నిత్యం గొడవలు జరుగుతున్నాయి. అంతే కాకుండా కొత్తగా కట్టుకున్న ఇల్లు గురించి, పొలాలు, ఆస్తుల విషయంలో తరచుగా గొడవలు జరుగుతూ ఉన్నాయి. అందులోను ఆశయ్య రెండో భార్య మంజులతో కలిసి ఉండటం సంగమణికి నచ్చలేదు. దీంతో గొడవలు ఇంట్లో పెరిగిపోయాయి. నిత్యం ఇంట్లో జరిగే గొడవలతో ఆశయ్యాకు తల నొప్పిగా మారి మనశాంతి లేకుండా పోయింది. ఇంట్లో జరిగే గొడవల తగ్గాలంటే ఎలాగైనా తన మొదటి భార్య సంగమణిని చంపాలని భావించాడు. ఇందు కోసం పథకం రూపొందించి మాచబోయిన మహేష్‌తో హత్యకు పథకం వేశాడు. సంగమణినీ హత్య చేస్తే రూ .20 వేలు ఒప్పందం చేసుకున్నాడు. పథకంలో భాగంగా ఆశయ్య, రెండో భార్యతో కలిసి బంధువుల ఊరికి వెళ్ళగా అదే రోజు 11 ఫిబ్రవరి రాత్రి సమయంలో మహేష్, శివకుమార్ కలిసి ఆశయ్య చెప్పినట్టుగా ఇంట్లో ఒంటరిగా ఉన్న సంగమణి వద్దకు వచ్చారు. ఇంటి వంట గది నుంచి పొగ బయటకు వెళ్ళడానికి ఏర్పాటు చేయబడిన రంధ్రం నుంచి లోపలికి వెళ్ళారు. నిద్రలో ఉన్న సంగమణిని ఈల పీటతో బలంగా ఆమె గొంతు పైన నరికినట్టు చెప్పారు. రక్తపు మడుగులో పడి చనిపోయినట్టు నిర్ధారించుకున్న తర్వాత మహేష్, శివ కుమార్‌లు కలిసి బెడ్ రూమ్‌లో బ్యాగులో నుంచి రూ 20 వేలు, సంగమణి కుడి చెవి కమ్మను తీసుకొని, ఆమె మెడలో ఉన్న నల్ల పూసల గోలుసులోని పుస్తె తెంపుకొని వెళ్ళిపోనట్టు వివరించారు. విచారణలో ఆమె భర్త భార్య హత్యకు ప్లాన్ వేసిన విషయాన్ని నిర్ధారించి ఇందుకు కారణమైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ రూరల్ సీఐ కేశవులు తెలిపారు. హత్య మిస్టరీని చేధించిన హవేళి ఘనపూర్ ఎస్సై ఆనంద్ గౌడ్, సిబ్బందిని అభినందించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం





నవతెలంగాణ-వెల్దుర్తి

జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయ వృత్తి పాత్ర పోషించి ఉపాధ్యాయులతో శభాష్ అనిపించుకున్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో మాసాయిపేట మండలం పోతినపల్లి గ్రామంలోని హైస్కూల్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తి పాత్ర పోషించి తోటి విద్యార్థులకు తనదైన శైలిలో పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య తోటి ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల పనితీరును పరిశీలించారు. ఒకరోజు ఉపాధ్యాయ పాత్ర పోషించిన వారిలో ఆర్జేడిగా దీపిక డిఈఓ గా వింధ్య ఎంఈఓ గా మధు ఏ ఎం ఓ అన్విశీ వీరితోపాటు మరి కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ యాదగిరి ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. అయితే డి ఈ ఓ గా వినయ్, ఎంఈఓ గా వెంకటేష్ ,ప్రధానోపాధ్యాయులుగా విష్ణువర్ధన్, ఉపాధ్యాయులుగా శ్రీవాణి, సంధ్య ,అంకిత, విజయలక్ష్మి, మనోహర్ బాబు, రాజేందర్ ,రవీందర్ ,సాయి, కిరణ్, లక్ష్మణ్, మనీశ్వర్, మహేష్,, తదితరులు వ్యవహరించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీశైలం, ఉపాధ్యాయులు మల్లయ్య, శివ శంకర్, శ్రీనివాస్, జగదాంబ ఉపేందర్, శేఖర్, సి అర్ పి రాధాగోపాల్, కంప్యూటర్ ఆపరేటర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అచ్చ తెలుగు భాషలో మాట్లాడడం, పద్యాలు, శ్లోకాలు పఠించడం,తెలుగు భాషపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీరజ మాట్లాడుతూ పర భాషా జ్ఞానాన్ని సంపాదించాలి కానీ మాతృభాషలోనే సంభాషించాలని, మాతృభాష తెలుగు అమ్మ ప్రేమలా స్వచ్ఛమైనదని, చిన్నారుల నవ్వులా అచ్చమైనదన్నారు. తెలుగు భాష ఉపాధ్యాయులు వెంకటేష్ మాట్లాడుతూ మాతృభాష తల్లిపాలలాంటిదని, పరభాష పోత పాల లాంటిదని, దేశభాషలందు తెలుగు లెస్స అని, మన మాతృభాష తెలుగు గొప్పతనం గురించి శ్రీకృష్ణదేవరాయలు ఆనాడే తెలిపినట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో భాషా ఉపాధ్యాయులు లలిత, రాధా, సరస్వతి, రాథోడ్, ఉపాధ్యాయులు రఘుపతి,రాజేశ్వర్ సుధాకర్ రెడ్డి, శ్రీ వాణి, శారద పాల్గొన్నారు.



రూ.1.3 కోట్లు మంజూరుపై కాంగ్రెస్ నాయకుల హర్షం

నవతెలంగాణ-నార్సింగి



కాంగ్రెస్ నాయకులు గురువారం మండల కేంద్రం లో విలేఖరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మెదక్ జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జంగర్ల గోవర్ధన్, టీజేఎస్ జిల్లా నాయకుడు కొండాపురం బాల రాజ్ గౌడ్, మున్నూరు కాపు మాజీ అధ్యక్షుడు లక్ష్మి నర్సింహులు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్సింగి మండలం లో పలు అభివృధి పనుల కొరకు కోటి ముప్పై లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. నార్సింగి పట్టణ కేంద్రం లో శివాలయం నుంచి పెద్దమ్మ ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు 20 లక్షలు, రైస్ మిల్ నుంచి ఎస్సీ కాలనీ సీసీ రోడ్డు కొరకు 10 లక్షలు, వట్టేపు బుజ్జి ఇంటి నుంచి రైస్ మిల్ వరకు సీసీ రోడ్డు కోసం 20 లక్షలు, గోదాము నందు మిగిలిన పనుల పూర్తి కొరకు 15 లక్షలు, ముదిరాజ్ సంఘం భావన నిర్మాణం కొరకు 5 లక్షలు, రెడ్డి సంఘం కొరకు 5 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. మండల పరిధి గ్రామమైన నర్సంపల్లిలో హనుమాన్ దేవాలయం నుంచి పెద్దమ్మ ఆలయం, చాకలి భూమయ్య ఇంటి నుంచి ఫక్రుద్దీన్ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు 10 లక్షలు మంజూరు చేశారన్నారు. భీం రావు పల్లి కోషీర్ నుంచి కిష్టా యాదగిరి ఇంటి వరకు సీసీ రోడ్డుకు 5 లక్షలు, అంజయ్య ఇంటి నుంచి పీ.బాలకిష్టయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు కు 5 లక్షలు, ముదిరాజ్ సంఘం భవన నిర్మాణం కొరకు 5 లక్షలు, పెద్ద తాండాకుగాను ఊరి పేరు సూచించే బోర్డు నుంచి తాండాలోని సేవాలాల్ ఆలయం వరకు సీసీ రోడ్డు కు 5 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. శేరిపల్లి గ్రామానికి సీసీ రోడ్డు, డ్రైనేజ్ కొరకు 15 లక్షలు కాగా, శంకాపూర్ తాండా లో సీసీ రోడ్డు నిర్మాణం కొరకు 10 లక్షలు మంజూరు అయ్యాయని వివరించారు. మండల అభివృద్ధి కొరకు నిధులు మంజూరు చేసినందుకు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇంచార్జీ మంత్రి కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలకు, నిధుల మంజూరు కు కృషి చేసిన మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభివృధి కి కట్టుబడి ఉందని, రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చి దిద్దడానికి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారనీ, ఖచ్చితంగా అభివృద్ధి చేసి చూపిస్తారని పేర్కొన్నారు. మండల పరిధిలోని మిగతా గ్రామాల అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయాలని కోరడం జరిగిందని, దానికి పెద్దలు త్వరలోనే నిధులు మంజూరు చేస్తారని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. నిధుల మంజూరు పై హర్షం వ్యక్తం చేస్తూ వక్తలు సమావేశాన్ని ముగించారు.

సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవు

నవతెలంగాణ- కౌడిపల్లి



సమయపాలన పాటించని వైద్య సిబ్బందిపై చర్యలు తప్పవని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా బుధవారం కౌడిపల్లి సిహెచ్ సి ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని రికార్డులను , ఫార్మసీని, ల్యాబ్ ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో చర్చించి అనుమతులు లేకుండా విధులకు గైరాజరైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మీడియాతో మాట్లాడుతూ కౌడిపల్లి లో ఆసుపత్రిని తనిఖీ చేయడం జరిగిందన్నారు. ఇక్కడ మెదక్ జిల్లాలోనే రెండో స్థానంగా డెలివరీలు జరుగుతున్నాయని అన్నారు ఇక్కడ కొత్తగా ఏడు మంది స్టాప్ నర్సులు రావడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో ఆయన మండిపడ్డారు అటెండెన్స్ రికార్డుల్లో రిమార్కులు రాయడం జరిగిందన్నారు .అలాగే సూపర్వైజర్, స్టాఫ్ నర్సులు రికార్డుల్లో రిమార్కులు రాసి డిఎం అండ్ హెచ్ ఓ , డి సి హెచ్ లకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. రేపటిలోగా గైర్హాజరు ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని అలాగే సమయపాలన పాటించాలన్నారు. నేషనల్ హైవే పక్కన గ్రామీణ ప్రాంతం కావడంతో ఎక్కువ మంది రోగులు వచ్చే ఆస్కారం ఉండడంతో డాక్టర్లు సిబ్బంది విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డి ఎం హెచ్ ఓ విజయనిర్మల ,హెచ్ ఈ, మంగ, హెచ్ ఈ ఓ సురేందర్ ,సిహెచ్ఓ ఎలిజబెత్ రాణి ,కౌడిపల్లి డాక్టర్ ప్రవీణ్ కుమార్ ,హెల్త్ సూపర్వైజర్ రమేష్ ,మార్త ,సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలి

ప్రిన్సిపల్ వెంకట రామారావు
నవతెలంగాణ-కౌడిపల్లి



మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం రోజున కళాశాల వార్షికోత్సవాన్ని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు విద్యార్థులు డిజె సౌండ్ సిస్టంలో నృత్యాలు చేశారు ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ వెంకట రామారావు ఉపన్యాసకుల బృందం బహుమతులను అందజేశారు అనంతరం కళాశాల ప్రిన్సిపల్ వెంకట రామారావు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ప్రథమ సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో మంచి మార్కులు సాధించి కళాశాలకు కళాశాల ఉపన్యాసకుల బృందానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు తెలిసిన వారి సలహాలు తీసుకొని వారి సూచనల మేరకు ముందుకు సాగాలని విద్యార్థులను ఉద్దేశించి తెలిపారు తల్లిదండ్రులను విద్య నేర్పిన గురువులను ఎన్నటికీ మరువరాదని ప్రిన్సిపల్ రామారావు తెలిపారు కళాశాల ఉపన్యాసకుల బృందం విద్యార్థులకు మెరుగైన ఫలితాల కోసం పలు సూచనలు ఇచ్చారు వార్షికోత్సవంలో ఉపన్యాసకులు సురేందర్ రెడ్డి భాస్కర్ చంద్రం దుర్గయ్య గిరిధర్ శ్రీకాంత్ శ్రీలత మంగమ్మ శ్రీనివాస్ గౌడ్ మణికాంత్ కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీకి సొసైటీ చైర్మన్ రాజీనామా

నవతెలంగాణ-చేగుంట



రెడ్డిపల్లి వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ మేకల పరమేష్ బిఆర్ఎస్ పార్టీకి బుధవారం రాజీనామా చేశారు. చేగుంట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ తన రాజీనామాకు సంబంధించి పలు అంశాలను వివరించారు. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రభాకర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడంలో తమ పాత్ర ఉన్నప్పటికీ తమను పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా పార్టీ శ్రేణులను పట్టించుకోకపోవడమే కాకుండా కీలక హోదాలలో ఉన్న వారికి సైతం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దుబ్బాకలో జరిగిన విజయోత్సవ సభలో గాని, ఇటీవల నల్గొండ సభకు గానీ, తాజాగా జరిగిన మండల శాఖ అధ్యక్షులు ఎన్నికలకు గాని సొసైటీ చైర్మన్‌గా ఉన్నప్పటికీ తనకు సమాచారం ఇవ్వకుండా చేశారని పేర్కొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యవహార శైలి వల్లే తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని తన రాజీనామా పత్రాన్ని జిల్లా అధ్యక్షులకు పంపిస్తున్నట్లు తెలిపారు.

పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పాటుపడ్డా

అధిష్టానం గుర్తించి తనకు ఎంపీ టికెట్ కేటాయించాలి
పార్టీ ఇచ్చిన పిలుపుతో ఉద్యమంలో పాల్గొన్న
ఉద్యమ నాయకులు మాజీ ఏఎంసీ డైరెక్టర్ మాలోతు మంగ్యానాయక్
నవతెలంగా-మనోహరాబాద్



పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో పాల్గొని ఉద్యమాల్లో పాల్గొన్నాని తనను పార్టీ గుర్తించి తనకు మెదక్ ఎంపీ టికెట్‌ను కేటాయిస్తే తాను పోటీ చేస్తానని బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ఉమ్మడి మెదక్ జిల్లా యువత అధ్యక్షులు మాలోతు మంగ్యానాయక్ పార్టీని కోరారు. బుధవారం ఆయన కూచారంలో విలేఖరులతో మాట్లాడుతూ తాను పార్టీలో 2004 నుండి పనిచేస్తున్నానని పార్టీ ఇచ్చిన పిలుపుతో ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నట్టు తెలిపారు. రైల్ రోకోతో పాటు ప్రతి ఉద్యమంలో పాల్గొన్నట్టు తెలిపారు. అలాగే విద్యార్థి నాయకుడిగా ఆనాడు ఓయూలో జరిగిన ఉద్యమాల్లో పాల్గొని పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసుకుని వెళ్లినట్టు తెలిపారు. గెల్లు శ్రీనివాస్, బాల్కసుమన్ విద్యార్థి నాయకుడిగా తాను కూడా ఆయనతో కలిసి పనిచేశానని తెలిపారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షునిగా ఉన్న బాబా ఫసియొద్దీన్‌తో కలిసి పనిచేశానని తెలిపారు. 2009లో కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షలో ఉన్న సమయంలో సిద్దిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావ్‌తో కలిసి ఉద్యమంలో కష్టపడి పనిచేశానని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఓయూలో జరిగిన అల్లర్లలో పోలీసుల కాల్పుల్లో రబ్బర్ బుల్లెట్ తగిలి ఆసుపత్రిలో చికిత్సను పొందినట్టు ఆయన గుర్తు చేశారు. తెలంగాణ సాధనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ఉద్యమాలతోనే కాంగ్రెస్ పార్టీ దిగివచ్చి తెలంగాణను ప్రకటించిందని దాంతో కేసీఆర్ తెలంగాణకు జాతిపితగా మారారన్నారు. కేసీఆర్ లేనిదే తెలంగాణ లేదని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమనాయకును గౌరవిస్తుందని వారికి సముచిత స్థానం కల్పించిన దాఖలాలు ఎన్నో ఉన్నాయని ఉద్యమంలో పాల్గొన్న వారిని ఎమ్మెల్యేలుగా మంత్రులుగా చేసిన ఘనత బీఆర్ఎస్‌దేనన్నారు. తాను కూడా ఉద్యమ నాయకుడిగా తనకు మెదక్ ఎంపీ టికెట్‌ను కేటాయిస్తే తాను పోటీచేస్తానని పేర్కొన్నారు. గతంలో తనకు పార్టీ గుర్తించి మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిందని అనంతరం జడ్‌పీటీసి స్థానం కోరితే ఇతరులకు కేటాయించిందన్నారు. ఇప్పటికైనా తనను పార్టీ అధిష్టానం గుర్తించి మెదక్ టికెట్‌ను కేటాయించాలని మాలోతు మంగ్యానాయక్ కోరారు. తనను పార్టీ అధిష్టానం గుర్తించి బంజారా లంబాడా కులానికి చెందిన తనకు తగిన గుర్తింపునివ్వాలని కోరారు. నియోజక వర్గంలో తమ కులానికి చెందిన సుమారు లక్షా యాభైవేల ఓట్లు ఉన్నాయని అలాగే ఉద్యమనాయకునికి తగిన గుర్తింపు నిచ్చినట్టు ఉంటుందని ఆయన కోరారు. పార్టీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావ్‌లతో పాటు జడ్‌పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్‌లను కోరుతున్నట్టు తెలిపారు.

రామాయంపేటలో బిఆర్ఎస్ కు షాక్

నలుగురు కౌన్సిలర్‌లు బిఆర్ఎస్ వీడి కాంగ్రెస్ లో చేరిక



నవతెలంగాణ-రామాయంపేట

రామాయంపేటలో బీఆర్ఎస్ పార్టీకి షాక్ తగిలింది. బిఆర్ఎస్ పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్‌లు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. రామాయంపేట మున్సిపాలిటీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు చిలుక గంగాధర్, దేమే యాదగిరి, సుందర్ సింగ్, దేవుని జయరాజు గులాబీ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం మల్కాజ్ గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

.....

వరిలో మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

మనోహరాబాద్ వ్యవసాయ అధికారి స్రవంతి
నవతెలంగా-మనోహరాబాద్



వరి పంట పొలాల్లో మొగి పురుగు నివారణకు రైతులు జాగ్రత్తలు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మనోహరాబాద్ వ్యవసాయ అధికారిణి స్రవంతి సూచించారు. బుధవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో వరి పంటలో మొగి పురుగు ఉధృతి బాగా ఉన్నట్టు గుర్తించినట్టు తెలిపారు. మొగి పురుగు నివారణకు రైతులు జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. నివారణ కోసం వయోగో 100 ఎంఎల్ ఎకరానికి పిచికారి చేయాలని రైతులకు వ్యవసాయ అధికారి స్రవంతి సూచించారు. అలాగే తూప్రాన్ మండలంలోని జండాపల్లి గ్రామంలో తూప్రాన్ వ్యవసాయ అధికారి గంగమల్లు వరి పంట పొలాలను పరిశీలించి గ్రామంలో రైతులతో మీటింగ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వరిలో వచ్చే చీడ పీడల నివారణకు చర్యలను రైతులకు వివరించినట్టు గంగమల్లు తెలిపారు.

నూతన ఎస్సైని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవ తెలంగాణ-కౌడిపల్లి



నూతన ఎస్సై రంజిత్ రెడ్డిని కాంగ్రెస్ జిల్లా నాయకులు చంద్రం కృష్ణ గౌడ్, మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఇటీవలే సిద్దిపేట నుంచి కౌడిపల్లి వచ్చిన రంజిత్ రెడ్డిని చంద్రం కృష్ణ గౌడ్, కౌడ శ్రీనివాస్ గుప్తా, మాజీ వార్డ్ మెంబర్ తిరుమలేష్, మండల గౌడ సంఘం అధ్యక్షులు సంతోష్ గౌడ్, ఆరిఫ్, రాకేష్, వినయ్, తేజ, నితీష్,జేకి, మల్లేష్, సాయి, ప్రవీణ్ గౌడ్, నరేందర్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకులు యూత్ గ్రామ ప్రజలు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

శ్రీ సిద్ధిరామేశ్వరాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-హవేలీ ఘనాపూర్



హవేలి ఘనపూర్ మండలం వాడి గ్రామంలోని శ్రీ సిద్ది రామేశ్వర స్వామి ఆలయ అష్టమ వార్షికోత్సవమును పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనం, మంటపరాధన అఖండ దీప స్థాపన, నవగ్రహమూర్తుల పూజ, అగ్నిప్రతిష్ట, రుద్ర హెూమం, విష్ణు సహస్ర నామ పారాయణం, తదితర ఆధ్యాత్మిక సంబంధిత కార్యక్రమాలలో శేరి సుభాష్ రెడ్డి పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శేరి ని మాజీ సర్పంచ్ యామిరెడ్డి, ఎంపీటీసీ సిద్ది రెడ్డి ల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ, గ్రామ ప్రజలు షాలువా కప్పి ఆత్మీయంగా సన్మానించారు. అనంతరం గ్రామ రైతులతో యాసంగి పంట సాగు గురించి ఎమ్మెల్సీ శేరి ముచ్చటించారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు ఏ సమయాల్లో ఇస్తున్నారని రైతులతో మాట్లాడి ఎమ్మెల్సీ తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వెంట హవేలీ ఘన్పూర్ మండల మాజీ సర్పంచులు సరిత సాయాగౌడ్, మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భిక్షపతి రెడ్డి, శీను నాయక్ వాడి గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శ్రీశైలం బయలుదేరిన శివ స్వాములు

నవతెలంగాణ- కొల్చారం

రానున్న మహాశివరాత్రి సందర్భంగా శివమాల ధరించిన శివ స్వాములు కొల్చారం మండలం తుక్కాపూర్ నుంచి శ్రీశైలంకు బుధవారం బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలోని హనుమాన్ మందిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఇరుముడులు ధరించి కాలినడకన శ్రీశైలం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు శివప్పగారి శ్రీశైలం, హనుమప్ప, శేఖర్, సురేష్, నవీన్, మధు లతోపాటు గ్రామానికి చెందిన సుమారు 15 మంది యువకులు శ్రీశైలంకు కాలినడకన తరలి వెళ్లారు.



ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షులుగా దీపక్

నవ తెలంగాణ -మిరు దొడ్డి

ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు గౌరవ శ్రీ డాక్టర్ విశారదన్ మహారాజు ఆదేశం మేరకు సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మహరాజ్ జిల్లా అధ్యక్షులు రవిబాబు సమక్షంలో ధర్మ సమాజ్ పార్టీ నూతన మండల కమిటీని ఎన్నిక చేశారు. ఈ కమిటీ ఏర్పాటుకు సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులకు నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షులు ఏర్రోల్ల దీపక్ మహరాజ్, ప్రధాన కార్యదర్శి ఎర్రోల్ల నవీన్, ఉపాధ్యక్షులు డి.రవి , కోశాధికారి భూపాల్ , మీడియా కార్యదర్శి డి.రాజేష్ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. మండల అధ్యక్షులు దీపక్ మాట్లాడుతూ మా మీద నమ్మకంతో బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర కార్యదర్శి సిద్దిపేట జిల్లా ఇంచార్జీ అన్నెల లక్ష్మణ్ మరియు జిల్లా అధ్యక్షులు కర్రోల్ల రవిబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ ధర్మ సమాజ్ పార్టీ అధినాయకులు గౌరవ శ్రీ విశారదన్ మహరాజ్ గారి ఆలోచన విధానంలో పూలే, అంబేడ్కర్, కాన్షిరాం లు కోరుకొన్న స్వరాజ్య సాధన కొరకు పనిచేస్తామన్నారు.

రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-మద్దూరు

మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలు. సైబర్ నేరాలు, గుడ్ టచ్, బాడ్ టచ్‌ల పై విద్యార్థులకు చేర్యాల సిఐ ఎల్ శ్రీను, మద్దూరు ఎస్ఐ షేక్ యూనుస్ అహ్మద్ అలీ, హుస్నాబాద్ షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.బాల్యవివాహాలను వ్యతిరేకించాలని ఆయన కోరారు.ఎవరైనా గుడ్ టచ్, బాడ్ టచ్ చేస్తే వెంటనే తల్లిదండ్రులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. అపరిచిత వ్యక్తుల పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. విద్యార్థులను ఎవరైనా వేధించినట్లయితే వెంటనే 100కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకన్న, అధ్యాపకులు, హుస్నాబాద్ డివిజన్ షీ టీం బందం సైదయ్య, హెడ్ కానిస్టేబుల్ మహిళా కానిస్టేబుల్ స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుల్ కృష్ణ, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు

రెడ్ బుక్ చదువుదాం - సమాజాన్ని మార్చుకుందాం

- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. భాస్కర్**



నవ తెలంగాణ -దుబ్బాక

ప్రతి ఒక్కరూ రెడ్ బుక్ ను చదవాలని తద్వారా సమాజాన్ని మార్చుకుందామని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.భాస్కర్ కోరారు.బుధవారం రెడ్ బుక్ డే సందర్భంగా దుబ్బాక పురపాలిక కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో "లెనిన్ ఓ విప్లవాయుధం" అనే పుస్తకాన్ని సామూహిక అధ్యయనం చేశారు. అనంతరం సీపీఐ(ఎం) పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.భాస్కర్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి ప్రమాదంగా మారిన పెట్టుబడిదారీ,సామ్రాజ్యవాద దేశాలకు వ్యతిరేకంగా సోషలిస్టు దేశాన్ని నిర్మించడం కోసం లెనిన్ కృషి చేశాడని తెలిపారు. పెట్టుబడుదారి వ్యవస్థను పతనం చేసి దాని స్థానంలో సోషలిజం అనే సహజ సాంఘిక సూత్రాన్ని ప్రజలకు అందించగలిగాడని స్పష్టం చేశారు. కండ్ల ముందు జరిగే అన్యాయాలను గ్రహించి దానిని ప్రచారం చేసి ప్రజా సమూహాలను విప్లవం వైపు నడిపించడానికి ఎనలేని కృషి చేశాడని కొనియాడారు ప్రస్తుతం భారతదేశంలో ఫాసిస్ట్ బీజేపీ ని ఓడించడమే తక్షణ కర్తవ్యంగా ఉండాలని,భారత రాజ్యాంగాన్ని విధ్వంసం చేయటానికి లౌకిక, గణతంత్ర,ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు..ఈ అధ్యయన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ మండల కమిటీ సభ్యులు ఎండి సాధిక్,నాయకులు లక్ష్మీనరసయ్య, ప్రశాంత్,సాజిద్,రాజు పలువురు పాల్గొన్నారు.**రెడ్ బుక్ డే సందర్భంగా సామూహిక పుస్తక పఠనం**

లెనిన్ స్ఫూర్తితో సమాజ మార్పు కోసం ఉద్యమించాలి : రాళ్ల బండి శశిధర్

సిద్దిపేట అర్బన్ : ప్రపంచ మానవాళి విముక్తి కోసం మార్క్స్ ఎంగెల్స్ రచించిన కమ్యూనిస్టు ప్రణాళిక ప్రజలకు అందించిన రోజు ఫిబ్రవరి 21 అని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్ తెలిపారు. ఆ స్ఫూర్తితో ప్రజలను దోపిడీ నుండి విముక్తి



చేయాలని సమసమాజ స్థాపనకు పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. రెడ్ బుక్ డే సందర్భంగా సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యాలయంలో లేనిన్ శత వర్ధంతిని పురస్కరించుకొని లెనిన్ రచించిన పుస్తకాలను సామూహికంగా పఠనం చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమానికి సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి అధ్యక్షత వహించగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, దాసరి ప్రశాంత్, జాలిగపు శిరీష, అమ్ముల బాల నరసయ్య, నాయకులు ప్రభాకర్, ఆంజనేయులు, లతోపాటు తదితర నాయకులు పాల్గొన్నారు.



గ్రామపంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలివ్వాలి

- **సిఐటీయు జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య**

నవ తెలంగాణ -సిద్దిపేట కలెక్టరేట్

సిద్దిపేట జిల్లాలో సుమారు 45 పైగా గ్రామపంచాయతీలో కార్మికులకు నాలుగు నుంచి ఆరు నెలల జీతాలు రాలేదని, సుమారు 200 పైగా గ్రామాల్లో మూడు నెలలపైగా జీతాలు రాలేదని వారికి వెంటనే ఇవ్వాలని సిఐటీయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై సిఐటీయు సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఆరు నెలలుగా జీతాలు రాక అప్పుల పాలు కావడం జరిగిందని అన్నారు పెరుగుతున్న ధరలు నిత్యవసర ఖర్చులతో అర్థాకలితో అలమటిస్తున్నారని అన్నారు..జిల్లా ఏర్పడి ఐదు సంవత్సరాలు అయినా జిల్లా పంచాయతీ అధికారి కనీసం కార్మికుల సంక్షేమ సంబంధించిన సర్క్యులర్ విడుదల చేయలేదని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు .ప్రతినెల ఇవ్వాల్సిన సబ్బులు నూనెలు, ప్రతి సంవత్సరం రెండు జతల డ్రెస్సులు ఇవ్వాలని ఉన్న అమలు చేయడం లేదని వారు తెలిపారు. 2023 సంవత్సరంలో కార్మికులందరికీ ఐదు లక్షల రూపాయల బీమా సదుపాయం కల్పించాలని మెమో విడుదల చేసినా గ్రామపంచాయతీలో వర్కర్ కు ఇన్సూరెన్స్ కట్టడం లేదని అన్నారు . వారి డిమాండ్లు పరిష్కరించకుంటే జిల్లా వ్యాప్తంగా పనులు బంద్ చేసి కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట చారి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నర్సింలు యాదగిరి బాబు కనుకవ్వ యాదయ్య రాములు లక్ష్మి మైసయ్య అనిల్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలం

నవతెలంగాణ-మద్దూరు

కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంలోనూ, విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాలపల్లి తాజా మాజీ సర్పంచ్ చొప్పరి వరలక్ష్మి సాగర్ అన్నారు, ఈ సందర్భంగా ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో. జాలపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు, సిద్దిపేట జిల్లా కేంద్రానికి. దూల్మిట్ట, మద్దూరు, చేర్యాల, నంగునూరు, మండలాలకు చదువుకోవడం కోసం వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం రోజున గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సును విద్యార్థులు ఎక్కేందుకు ప్రయత్నించగా. బస్సులో ఒక్క సీటు కూడా లేక బస్సు మొత్తం కిక్కిరిసిపోయిందని ఆమె తెలిపారు. బస్సులో స్థలం లేకపోవడంతో విద్యార్థులు ఖాళీ నడకన నంగునూరు, దూల్మిట్ట, మండలాలకు వెళ్లినట్లు ఆమె తెలిపారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండడంతో ప్రభుత్వం వెంటనే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు వేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక కుప్పకూలిన తండ్రి

- **మృతదేహానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు**



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, మాజీ బీఆర్ఎస్ గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులు బండి వెంకటయ్య ఇటీవల హత్యకు గురయ్యారు. వెంకటయ్య అకాల మరణాన్ని జీర్ణించుకోలేక రోదిస్తూ అతని తండ్రి బండి బాలమల్లు (90) బుధవారం కుప్పకూలాడు. గత 18 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన గ్రామ మాజీ సర్పంచ్ భర్త బత్తుల తిరుపతి బండి వెంకటయ్యను హత్య చేయించాడు. దీంతో వెంకటయ్య మృతి చెందినప్పటి నుండి అతని తండ్రి రోదిస్తూ, శోకసంద్రంలో మునిపోగా... బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు రావడానికి 15 నిమిషాల ముందు అతని కుమారుడిని అన్యాయంగా హత్య చేయించారని గట్టిగా రోదిస్తూ అక్కడే కుప్పకూలి మతి చెందినట్టు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా అదే సమయంలో అక్కడికి చేరుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు మృత దేహానికి నివాళ్లు అర్పించి, కుటుంబాన్ని ఓదార్చారు.

రిపోర్టర్ ను పరామర్శించిన మాజీ మంత్రి హరీష్ రావు

నంగునూరు మండల సాక్షి రిపోర్టర్ తులసి బంధువులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పాలమాకులలో తులసీని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు పరామర్శించారు. అదేవిధంగా పాలమాకుల గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త అసర్ల యాదగిరి తల్లి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. నంగునూరు మండలం పాలమాకుల సొసైటీ చైర్మెన్ ఎల్లంకి మహిపాల్ రెడ్డి సోదరుడు, వెంకటాపూర్ గ్రామానికి మాజీ సర్పంచ్ గీత భర్త ఎల్లంకి వెంకట్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.వారి కుటుంబాన్ని హరీష్ రావు పరామర్శించారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసానిచ్చారు.

ప్రజలకు రక్షణగా ఉండాలి : సీపీ అనురాధ

- **రూరల్ పోలీస్‌స్టేషన్, భరోసా, సఖి సెంటర్ సందర్శన**

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

ప్రజల రక్షణకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని సిపి అనురాధ అన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ మరియు సఖి భరోసా కేంద్రాలను సందర్శించారు . అనంతరం వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, వారి మర్యాదకు ఎలాంటి భంగం కలిగించవద్దని సూచించారు. ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఇసుక, పిడిఎస్ రైస్, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తెలిపారు. సైబర్ నేరాలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి ప్రజలకు యువకులకు విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భరోసా సెంటర్ కు వచ్చే ప్రతి ఒక్కరికి



సత్వరమే భరోసా కల్పించాలని. భరోసా సెంటర్ కు వచ్చే బాధిత మహిళలకు పిల్లలకు అన్ని రకాల సేవలు అందించాలని సూచించారు. సఖి సెంటర్లో మహిళలకు, అనాథ మహిళలకు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అపూర్వ రెడ్డి, భరోసా, సఖి సెంటర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవనవిధానంలో భాగమైన కంప్యూటర్ పరిజ్ఞానం

ఎమ్మెల్యే హరీశ్ రావు

నవ తెలంగాణ - సిద్దిపేట

కంప్యూటర్ పరిజ్ఞానం జీవన విధానం లో భాగమైందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని గర్ల్స్ హై స్కూల్ లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ సహకారంతో 50లక్షల సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను హరీశ్ రావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాల దినదిన అభివృద్ధి జరుగుతుందనీ, గతంలో ఈ పాఠశాల వర్షం వస్తే పెచ్చులు ఉడుతాయని బంద్ చేసేది, నేడు కార్పొరేట్ స్కూల్‌ను తలదన్నేలా ఉందనీ అన్నారు. 50లక్షల సిఎస్ఆర్ నిధులతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసుకున్నామని, త్వరలోనే ఈ పాఠశాలకు కంప్యూటర్ ఇన్స్ట్రక్టర్ ను ఏర్పాటు చేస్తామని అన్నారు. రాబోయే కాలం మొత్తం కంప్యూటర్ కాలమే కావున విద్యార్థులు వీటిని వినియోగించుకోవాలనీ అన్నారు. ఈసారి ఈ పాఠశాల పదవ తరగతిలో వందశాతం పలితాలు సాధించాలనీ అన్నారు. మీరు నాకు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ పదిలో 10 జి పి ఎ, 100 శాతం మార్కులు సాధించాలనీ అన్నారు. సిద్దిపేట నియోజకవర్గం లో పదిలో ప్రథమ



స్థానం లో నిలవాలన్నారు. నీటిని వృధా చేయవద్దు, అవసరం మేరకే వాడుకోవాలనీ, పక్కింటి వారికి కూడా నీటి పొదుపుపై చైతన్యం చేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వార్డు కౌన్సిలర్ పూర్ణిమ ఎల్లం యాదవ్, నాయకులు సాయిరాం, మొయిజ్, రవీందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ- గజ్వేల్

బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల కొండపాక లో నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపల్ ఇందిరా దేవి అధ్యక్షతన ఓటరు నమోదు అవగాహన సదస్సులో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు విద్యార్థులకు ఓటు హక్కు ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి దేశ బోయిన నర్సింలు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు అనే రెండు అక్షరాల పదం దేశ భవిష్యత్తును మార్చేస్తుందని అన్నారు. కుల, మత, ప్రాంత, లింగ, జాతి, భాష అనే భేదం లేకుండా దేశంలో నివసించే 18 సంవత్సరాలు నిండిన పౌరులందరికి భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని, కాబట్టి అర్హులందరు ఓటు హక్కును ఉపయోగించుకోవాలని తెలిపారు. అక్టోబర్ 1వ తేదీ తో 18 సంవత్సరాలు పూర్తయే వారందరూ ఓటర్ గా నమోదు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం పై విశ్వాసం తో, మనదేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామనీ, మతం, జాతీ, కులం, వర్గం, భాష తారతమ్యాలు లేకుండా ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండ ప్రతి ఎన్నికలలో నిర్భయంగా ఓటు వేస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలన్నారు అలాగే విద్యార్థులందరూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బందం నెహ్రూ యువకేంద్ర వాలంటీర్ నర్సింలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మర్పడగ పాఠశాలలో స్వపరిపరిపాలన

నవతెలంగాణ- కొండపాక

కొండపాక మండలం మర్పడగ దుద్దెడ పాఠశాల విద్యార్థులు బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా డీఈవోగా పి. సంకర్షణ్, డిప్యూటీ ఈవోగా పి. అభిషేక్, ఎంఈఓ గా డి. సుశాంత్, ప్రధానోపాధ్యాయులుగా డి. మోక్షిత్ లతో సహా 28 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠశాలలో తమ విధులను నిర్వర్తించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుంచు భూమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, విద్యార్థి దశలోనే ఉపాధ్యాయులు కావాలన్నా ఆలోచనను విద్యార్థుల్లో పెంపొందించడానికి గాను, విద్యార్థులు వారి భావి జీవితంలో ఉన్నతంగా జీవించడానికి, విద్య, బోధన అంశాలలో ఆసక్తిని పెంపొందించడానికి స్వయం పరిపాలన దినోత్సవం దోహదపడుతుందన్నారు . ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈరబత్తిని జగన్నాథం, భానూరి సీతారాం రెడ్డి, జక్కుల నర్సింలు, పి. కష్ణవేణి, ముదిగొండ అశోక్, గంగాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

జంగపల్లిలో ఘనంగా స్వపరిపాలన

నవ తెలంగాణ -మిరు దొడ్డి

అక్బర్ పేట-భూంపల్లి మండలం జంగపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం రోజున ఘనంగా స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు విద్యార్థి లు ఉపాధ్యాయులుగా మారారు. డీఈవోగా దినేష్, ఎంఇఓగా అజయ్ నంద, ప్రధానోపాధ్యాయురాలుగా అఖిల, ఉపాధ్యాయులుగా శ్రావణి,స్నేహ,భవాని, రఫీద్, మహేష్, సాయి తేజ, తదితరులు పాల్గొన్నారు. అటెండర్ గా దమ్ము అనిల్ వ్యవహరించాడు. బోధనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు మోర జయప్రద, ఉపాధ్యాయులు భాస్కర్, నాగిరెడ్డి, వెంకటేశం, రవి, సౌజన్య శ్రీకాంత్ రెడ్డి, నిమ్మ సాయిలు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మలాంటి తెలుగు భాషను మరవద్దు

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

తెలుగు భాష అమ్మలాంటిదని ఎప్పటికీ భాషను మరవకూడదని ప్రజ్ఞాపూర్ సెంట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి అన్నారు.గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలలో అంతర్జాతీయ మాతీభాష దినోత్సవం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల ప్రజలలో మన తెలుగు రాష్ట్రాల నుండి తొమ్మిది కోట్ల ప్రజలు ఉన్నారన్నారు. పూర్తిగా తెలుగును పక్కన పెట్టి ఇతర భాషలను ప్రోత్సహించినట్లయితే అది ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ థామస్‌రెడ్డి, ప్రిన్సిపల్ రాయప్ప, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

పౌష్టిక లోపాలను తలెత్తకుండా చూడండి

నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 11 అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ గరీమ అగ్రవాల్ సందర్శించారు. అంగన్వాడీలో చిన్నారుల్లో పోషకాహార లోపాలు తలెత్తకుండా ఉండేందుకు పిల్లల తల్లిదండ్రులు కు అవగాహన కల్పించారు. పిల్లలలో చిన్న వయసు నుంచే సరైన ఎదుగుదల ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పిల్లలలో పోషకాహార లోపం ఏర్పడకుండా అంగన్వాడి కేంద్రానికి పంపిణీ జరిగే బాలామృతం ఫ్లస్ ను సరైన విధంగా వినియోగించుకోవాలని సూచిస్తూ గర్భిణీ బాలింతలకు హిమోగ్లోబిన్ తగ్గకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తక్కువ బరువు ఉన్న పిల్లల ఎత్తు, బరువులను స్వయంగా పరిశీలించారు. కేంద్రానికి సప్లై అయ్యే గుడ్ల నాణ్యతను పరిమాణమును పరిశీలించారు. ఈ కార్యాలయం ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ, శ్రీగిరిపల్లి మెడికల్ ఆఫీసర్, సిడిపిఓ, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కోతిని రక్షించడానికిపోతే... ఉపాధ్యాయుడు,విద్యార్థులపై కోతుల దాడి

- **కోతుల సంచారంతో పాఠశాల సిబ్బంది బెంబేలు**

నవతెలంగాణ-బెజ్జంకి

కిటికిలో చిక్కుకున్న కోతిని రక్షించడానికిపోతే మరో కోతి వచ్చి ఉపాధ్యాయుడిని తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వోన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. పాఠశాల సిబ్బంది తెలిపిన వివరాల మేరకు బాలికల ప్రభుత్వోన్నత పాఠశాల అవరణంలోకి కోతుల గుంపు ప్రవేశించింది. గుంపులోని కోతి కిటికిలో చిక్కుకోవడంతో రక్షించడానికి ప్రయత్నించిన ఉపాధ్యాయుడు సురేశ్ బాబుపై మరో కోతి దాడి చేసింది. దీంతో ఉపాధ్యాయుడి వీపుపై గాయమై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన



పాఠశాల సిబ్బంది విద్యార్థుల సహయంతో స్థానిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యురాలు నజీమ్ ఉన్నీసా తహసీన్ బాధితుడిని పరీక్షించి చికిత్స అందించారు.మరో ఇద్దరు విద్యార్థులపై కోతులు దాడి చేయగా పదవ తరగతి చదువుతున్న మణిదీపుకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనతో పాఠశాలలో భయానక వాతావరణం నెలకొంది.అధికారులు స్పందించి కోతుల నివారణకు సత్వర చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వేడుకున్నారు.

ఘన వ్యర్థాల నిర్వాహణ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నవతెలంగాణ- సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని ఇరుకోడు గ్రామ పంచాయతీ పరిధిలో సహాస్ వారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఘన వ్యర్థాల నిర్వహణ పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. దానిలో భాగంగా తడి, పొడి మరియు ప్రమాదకరమైన చెత్తను వేరు చేసి ఇవ్వడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి స్టీలు వస్తువులు, క్లాత్ బ్యాగ్‌లు ఉపయోగించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు జియో మెట్రీ బాక్స్ లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జీవన్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మారెడ్డి మధుసూధన్ రెడ్డి, సాహాస్ ఎస్ డబ్ల్యూ ఎం మొగిలి, శేఖర్, కోఆర్డినేటర్ చిన్న, ఫీల్డ్ సూపర్ వైజర్లు, బాలరాజు గౌడ్, దుర్గాప్రసాద్, సుమాదేవి, వంశీ,రవి మరియు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నవోదయలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని నవోదయ విద్యాలయంలో 'తెలుగు భాషా దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. భాషా దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పద్యాలను అలకించారు. తెలుగు భాషకు సంబందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ మాట్లాడుతూ పరభాషా అబ్యాసం మాతృభాషకు అడ్డంకి కాకూడదని అన్నారు. తాను చిన్నప్పుడు మాతృభాషలోనే విద్యాభ్యాసం చేశానని చెప్పారు. తెలుగు భాషా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. త్వరలోనే పదవి విరమణ పొందనున్న తెలుగు అధ్యపకురాలు ఝాన్సీ రాణి తెలుగు విశిష్టతను గురించి ప్రసంగించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం నర్మెట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. పై తరగతి విద్యార్థులు కిందితరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. డీఈవోగా పిల్లి శివకుమార్, ఎంఈఓగా కాలకుంట్ల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలుగా కొలుపుల వైష్ణవి, ఉపాధ్యాయులుగా అఖిలా, శృతి, పూజ, వర్షా శ్రీజాస్మిని, దివ్య, హారిక, హాసిని, భార్గవి, హాసిని, మనోజ్ఞ, మనూష, ప్రణతి, రమ్య, సంధ్య, అఖిల, శ్రావణి, స్నేహరితిక, వైష్ణవి, అవినాష్ రెడ్డి, జితేందర్, మనోజ్, రాకేష్, హర్షవర్ధన్, చరణ్, పావని, పూజ, రాజు, కరుణాకర్, అటెండర్ గా కట్ట గణేష్ తదితరులు విధులు నిర్వహించారు. ఎంఈఓ దేశిరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పర్యవేక్షించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, గణేష్, ప్రభాకర్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, కనకయ్య, జనార్ధన్ రెడ్డి, ఆనంద రెడ్డి, గఫూర్, శివయ్య లలిత, నరేందర్, రాజ్ కుమార్, సీఆర్పీ రేణుక, ఎస్ఎస్‌వి టీచర్లు చంద్రకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఉద్యోగాల నియామకం

నవ తెలంగాణ - సిద్దిపేట

శ్రీరామ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 23న కోటి లింగాల గుడి లోపల గల యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి నీల రాఘవేంద్ర తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, 35 సంవత్సరాల లోపు ఉన్న నిరుద్యోగ యువకులు ఉదయం 11 గంటలకు సర్టిఫికెట్ జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

కొండపాక పాఠశాలలో అంతర్జాతీయ మాతభాషా దినోత్సవం

నవ తెలంగాణ -కొండపాక

కొండపాక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భువన విజయం నాటక ప్రదర్శన చేశారు. తెలుగు భాష గొప్పతనం, మాతభాష అభిమానాన్ని చూపే నాటకాన్ని విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విటల్ నాయక్ మాట్లాడుతూ మనిషి యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రస్తుత రోజులలో కళలను ఆస్వాదించలేకపోతున్నాడని, ప్రతి మనిషి జీవితంలో కళారాధన ఒక భాగం చేసుకోవాలన్నారు. భువన విజయాన్ని ప్రదర్శించిన విద్యార్థులను, దర్శకత్వం వహించిన తెలుగు ఉపాధ్యాయురాలు జి. సత్యలక్ష్మి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హారతి, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి అరుణ్ కుటుంబానికి ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు నాచారం శేఖర్ మాట్లాడుతూ, గజ్వేల్ పట్టణంలో వున్న ఎడ్యుకేషన్ హబ్ లో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నటువంటి అరుణ్ కుమార్ ప్రమాదానికి గురి అయ్యి మతి చెందడం జరిగిందన్నారు. మృతి చెందిన అరుణ్ బీసీ వసతి గహం విద్యార్థి, అరుణ్ మిత్రుడు ఎస్సి వసతి గహం విద్యార్థి. హాస్టల్ నుండి విద్యార్థులు ఎక్కడికి వెళ్తున్నారు. ఎవరితో వెళ్తున్నారు అని కనీస పర్యవేక్షణ లేని హాస్టల్ వార్డెన్స్, కాపలా దరుడు పై చర్యలు తీసుకోవాలి అని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం అరుణ కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా కోరారు. ఆయనతో నాయకులు కరుణాకర్, చింటు, కార్తిక్, ప్రణయ్, భారత్, తదితరులు వున్నారు.

సిరి చిల్డ్రన్స్ ఆసుపత్రిలో ప్రారంభించిన ఎమ్మెల్యే

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట లో సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్ ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రారంభించారు. బుధవారం పట్టణంలో పిల్లల వైద్యులు డాక్టర్ సాయిరాం ఆధ్వర్యంలో ఏర్పడిన సిరి చిల్డ్రన్స్ ఆసుపత్రిని జెడ్పి చైర్ పర్సన్ రోజా శర్మ తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, వార్డ్ కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి వధువుకు పుస్తె మట్టలు అందించిన ఎంపీపీ

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని నర్సాయ పల్లి,గ్రామానికి చెందిన పండుగ సుజాత,కిషన్ దంపతుల కుమార్తె సంధ్య, వివాహానికి మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, నర్సాయపల్లి తాజా మాజీ సర్పంచ్ బద్దిపడగ లలిత కృష్ణారెడ్డిలు, నూతన వధువుకు బుధవారం పుస్తె మట్టెలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలో పెళ్లి చేసుకునే ప్రతి ఒక్కరికి తమ తరపున పుస్తె మట్టెలు అందిస్తున్నట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

నవ తెలంగాణ- రాయపోల్

విద్యార్థులు క్రమశిక్షణ పట్టుదలతో చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులు ఉన్నత స్థానాలకు వెళ్లి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను సక్రమంగా విని పది పరీక్షల్లో 10/10 సాధించి పాఠశాలలను జిల్లాలో ముందంజలో ఉంచాలని రాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం రాయపోల్ మండలంలోని రాంసాగర్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తమంగా బోధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ గా అనుష, ప్రధానోపాధ్యాయులుగా పి అఖిల ఎంఈఓ గా బి అనూష, డిప్యూటీ డీఈవోగా పి శ్రావణి, ఎంఎన్ఓ గా కే అనుష సీఈవో గా వచ్చే కావ్య, ఎస్ ఓ అర్చన, ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.హెచ్.ఎస్ రాంసాగర్, ఉపాధ్యాయులు వై గోవర్ధన్, రాజ్ కుమార్, నరేందర్ రెడ్డి, కిషన్, సావిత్రి, సవిత ఈశ్వర్, పిటి అనిఫ్, సిఆర్పి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కొండపాక : మండలం దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పబ్బోజు రక్షిత, జిల్లా విద్యాధికారిగా శనిగరం రంజిత్ కుమార్, ఉప విద్యాధికారిగా సల్మా , మండల విద్యాధికారిగా ఏముల అంజలి ప్రియ 36 మంది విద్యార్థులంతా సబ్జెక్టు టీచర్స్ గా వ్యవహరించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సమ్మక్క,సారలమ్మ జాతర ఏర్పాట్లు

నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామంలో వెలిసిన శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం జాతర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. బుదవారం ఆలయ పూజారి పిట్ల పరశురాములు మాట్లాడుతూ శ్రీ సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని మరో మేడారం లాగా గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామంలో వెలసిన వనదేవతలు సమ్మక్క సారలమ్మ ఆలయం నిలవనుంది అని అన్నారు.

రాజ్యాంగంపై అవగాహన తప్పనిసరి

నవ తెలంగాణ -దుబ్బాక

ప్రతి ఒక్కరు రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డీబీఎఫ్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్ శేఖర్ అన్నారు.బుధవారం దుబ్బాక మండల పరిధిలోని రాజక్కపేట జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు "భారత రాజ్యాంగం -గణతంత్ర దినోత్సవం" అన్న అంశాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు నాగభూషణంతో కలిసి బహుమతులను అందజేశారు.పాఠశాల ఉపాధ్యాయ బందం ఉన్నారు.



తొగుట ఆర్అండ్ఆర్ కాలనీలో సమ్మక్క ,సారలమ్మ జాతర

నవతెలంగాణ-తొగుట

ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామంలో వెలి సిన శ్రీ సమ్మక్క, సారలమ్మ దేవాలయం జాతర ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. బుదవారం ఆలయ పూజారి పిట్ల పరశురాములు మాట్లాడుతూ శ్రీ సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో అందరూ బాగుండాలని మరో మేడారంలాగా ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ గ్రామంలో వెలసిన వనదేవతలు సమ్మక్క, సారలమ్మ ఆలయం నిలవనుంది అని అన్నారు.

మద్దూరు : దూల్మిట్ట మండలంలోని కూటిగల్ గ్రామంలో జరుగుతున్న సమ్మక్క, సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కొండూరు శ్రీనివాస్, ఆధ్వర్యంలో కోయ పూజారులు సారలమ్మను వనంలో నుండి జనంలోకి తీసుకువచ్చారు.అనంతరం డప్పు చప్పులతో మంగళ వాయిద్యాలతో మంగళ హారతులతో సారాలమ్మకు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

బేగం పేట నూతన ఎస్ఐగా రవి కాంత్ రావు

నవ తెలంగాణ -రాయపోల్

బేగంపేట పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన రవి కాంత్ రావు బుదవారం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధను కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.

గజ్వేల్ మున్సిపల్ బడ్జెట్ సమావేశానికి 14 మంది కౌన్సిల్ సభ్యులు దూరం



- బడ్జెట్ సమావేశం వాయిదా

నవ తెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సాధారణ బడ్జెట్ 2023 -24 సంబంధించిన సమావేశాన్ని బుధవారం చైర్మన్ రాజమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో చైర్మన్ నేతి చిన్న రాజమౌళి తోపాటు వైస్ చైర్మన్ జాకీర్, కౌన్సిల్ సభ్యులు భాగ్యలక్ష్మి దుర్గ ప్రసాద్, ఉప్పల మెట్టయ్య, గోపాల్ రెడ్డి, రహీముద్దీన్ హాజరు కాగా మిగతా 14 మంది బడ్జెట్ సమావేశాలకు దూరంగా ఉన్నారు. దీంతో కోరం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాన్ని వాయిదా వేసినట్లు కమిషనర్ గోల్కొండ నరసయ్య నవ తెలంగాణతో తెలిపారు. తిరిగి బడ్జెట్ సమావేశాలను ఎప్పుడు అనేది నిర్ణయిస్తామని ఆయన తెలిపారు. గత ఆరు నెలలకు పైగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని కౌన్సిల్ ల మధ్య విభేదాలు రావడంతో సమన్వయం లేదు. కౌన్సిల్ సభ్యుల మధ్య సయోధ్యకు మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, తెలంగాణ ఫారెస్ట్ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి రంగంలో దిగడంతో ఇరువురు మధ్య చర్చ జరుపుతున్నట్టు తెలిసింది. బడ్జెట్ సమావేశాలకు కౌన్సిల్ సభ్యులు దూరం ఉండడంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు భారత రాష్ట్ర సమితి నాయకత్వం రంగంలో దిగింది. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్లాలని సూచించినట్లు తెలిసింది. ఒకవేళ అవిశ్వాసం ఎదుర్కొంటే రాజకీయం మలుపులు తిరిగి అవకాశం ఉంటుంది.

ఇందిరాగాంధీ విగ్రహ శిలాఫలకం ధ్వంసం

నవ తెలంగాణ -మిరుదొడ్డి



ఇందిరాగాంధీ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు గత రాత్రి ధ్వంసం చేసిన ఘటన మిరుదొడ్డి మండలంలో చోటుచేసుకుంది. మిరుదొడ్డి మండల కేంద్రంలో 20వ తేదీన కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి విగ్రహ విష్కరణ చేశారు. అదే రాత్రి గుర్తుతెలియని దుండగులు విగ్రహ ఏర్పాటుకు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం జరిగిందని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం శిలాఫలకం ధ్వంసం అయిన విషయాన్ని గమనించి, స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశం వెల్లడించారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



విద్యార్థి దశలోనే శాస్త్రీయ విజ్ఞానం

- విద్యార్థులు మూఢనమ్మకాలు వీడాలి
- సిద్దిపేట రూరల్ సీఐ శీను

నవతెలంగాణ -సిద్దిపేటరూరల్

విద్యార్థి దశలోనే శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, అన్నారు . బుధవారం సిద్దిపేట్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై అపూర్వ రెడ్డి ఆధ్వర్యంలో సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రాఘవపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మూఢనమ్మకాల నిర్మూలన- విద్య అవశ్యకత - మహిళల రక్షణ అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐ శీను హాజరై మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని. విద్యార్థి దశలోనే మూఢనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారని అన్నారు. సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ దయ్యాలు భూతాలు మంత్రాలు బూటకమని. సైన్స్ ను సైనికుడిలా విద్యార్థులు ముందుకు నడవాలని. విద్యార్థి దశలోని ఉన్నత చదువులతో మీతల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతి పై కిరోసిన్ తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం, లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ పరమేశ్వరి, పోలీస్ సిబ్బంది రవిరాజ్, రాజు, ఇంచార్జీ హెచ్ఎం చంద్రమౌళి, అధ్యాపక బందం తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ కోసం వసూలు చేసిన డీడీలను తిరిగి ఇవ్వాలి

నవతెలంగాణ -కొండపాక



గత ప్రభుత్వ హయాంలో గొల్ల కురుమల ఆర్థికాభివృద్ధి కోసం రెండో విడత గొర్రెల పంపిణీ అందజేస్తామని చెప్పడంతో అప్పులు చేసి డీడీలు కట్టిన గొల్ల కురుమలకు నిరాశ ఎదురైందని సిద్దిపేట జిల్లా బీసీ అధ్యక్షుడు కందూరి అయిలయ్య పేర్కొన్నారు. కుకునూరు పల్లి మండలం లకుడారం గ్రామం పంచాయతీ ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు... ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం మొదటి విడతకు విడుదల సజావుగా అందజేసిందన్నారు .రెండో విడత పంపిణీ కొరకు గొల్ల కురుమల నుండి ఒక్క యూనిట్ కు ఒక్కొక్కరికి 43,750 రూపాయల చొప్పున జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయల ను ప్రభుత్వం డిడి ల రూపంలో చెల్లించారని తెలిపాడు.గొర్రెలు వస్తాయని తమ కుల వృత్తి పనిలో తాము అభివృద్ధి చెందుతామని ఆశపడ్డ వాళ్లకు ఇప్పటికీ గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టకపోవడంతో నిరాశకు గురయ్యారన్నారు. ప్రభుత్వం వెంటనే దీనిపై చర్యలు తీసుకొని గొల్ల కురుమలకు న్యాయం జరిగేలా డి డీలు కట్టిన వారికి తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసానికి వినతి

నవ తెలంగాణ- గజ్వేల్



బుధవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్‌పై గతంలో ఇచ్చిన అవిశ్వాస తీర్మానంపై చర్యలు తీసుకోవాలని అలాగే మున్సిపల్‌లో మంజీరై నిర్మాణం జరుగుతున్న పనులపై విచారణ జరిపించాలని కోరుతూ పాలకవర్గ సభ్యులు జిల్లా అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్‌కి వినతి పత్రం అందించారు. బుధవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలిసి వినతి పత్రం అందించారు. అలాగే గత నెల సమావేశంలో మున్సిపల్ పరిధిలో పని చేయకుండానే డ్రా చేసిన డబ్బుల విషయంలో మున్సిపల్ చైర్మన్ ను నిలదీస్తే వారం రోజుల్లో విషయంపై చర్య తీసుకొని ఎవరైతే పనిచేయకుండా ఈ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వాళ్లపై చర్యలు తీసుకునే విధంగా చూస్తానని చెప్పిన చైర్మన్ మాట తప్పడంతో బడ్జెట్ సమావేశాలను బహిష్కరించి అడిషనల్ కలెక్టర్‌ను కలిసి విషయాలను ఆమెకు వివరించడం జరిగింది. అవిశ్వాసం పత్రంలో సంతకాల చేసిన వారిలో కౌన్సిల్ సభ్యులు రజిత, బాలమణి, విద్యా రాణి, అల్వాల బాలేష్, అత్తిలి శ్రీనివాస్, కూరాకుల శ్రీనివాస్, బొగ్గుల చందు, చందన తోపాటు మరికొందరు వినతిపత్రం లో సంతకాలు చేశారు.

సబ్‌స్టేషన్‌లో చెలరేగిన మంటలు

అంధకారంగా మారిన సిద్ధిపేట

నవ తెలంగాణ - సిద్దిపేట



పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న 132 కెవి/32కెవి సబ్ స్టేషన్ లో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సిద్దిపేట మొత్తం అంధకారంగా మారింది. సుమారుగా రెండు కోట్ల ఆస్తి నష్టం జరిగిందని అంచనా.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

- గజ్వేల్ గర్ల్స్ఎడ్యుకేషన్ హబ్ సమీపంలో ఘటన

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో స్కూటీ అదుపుతప్పి బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన ప్రకారం.. సంగాపూర్ రోడ్డు గల గర్ల్స్ ఎడ్యుకేషన్ హబ్ సమీపంలో స్కూటీ అదపుతప్పి డివైడర్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరొక వ్యక్తి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. సంఘటన స్థలానికి చెరుకున్న 108 సిబ్బంది సీపీఆర్ నిర్వహించినా లాభం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో దౌల్తాబాద్ మండలం షేర్ పల్లి చెందిన అరుణ్ (20) అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి వర్గల్ మండలం గౌరారంకు చెందిన అయన్(21) అని యువకుడు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.మూడవ వ్యక్తి హైదరాబాద్ అసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతివేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. పోలీసులు సంఘట స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తన కొడుకు స్కూటీ ఎక్కడంపై అరుణ్ తండ్రి శ్రీను స్కూటీ యజమానిపై ఫిర్యాదు చేశారు. కాలేజీ నుంచి బుక్స్ ల కోసం వెళ్లి వస్తున్న వారిని స్కూటీపై ఎక్కించుకున్న వ్యక్తి అజాగ్రత్తగా, అతివేగంగా నడపడం వల్ల తన కొడుకు మరణానికి కారణమయ్యారని పేర్కొన్నారు.

లారీ ఢీకొని బాలుడు మృతి

కొండపాక : లారీ ఢీ కొట్టి బాలుడు మృతి చెందిన సంఘటన కుకునూరు పల్లి బస్టాండ్ వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తలపాక లావణ్య తన కుమారుని రిత్విక్‌తో కలిసి మాత్ పల్లి లో జరుగుతున్న దేవాలయ ప్రతిష్ట ఉత్సవాలకు బంధువుల ఇంటికి వెళ్లడానికి కుకునూరుపల్లి లో బస్సు దిగింది. ఆటోకోసం రోడ్డు దాటుతున్న క్రమంలో సిద్దిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బాలుడిని ఢీకొట్టింది. దాంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్ళముందటే కుమారుడు మీతి చెందడంతో తల్లి లావణ్య కుమారుని శవం పై పడి లబోదిబోమంటూ ఏడ్చిన దృశ్యం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. బాలుడు అంకిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఏసీపీ బాలాజీకి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అదుపులో ఉంచే వ్యక్తి గజ్వేల్ ఏసిపి బాలాజీ అని బార్ అసోసియేషన్ సభ్యులు పార్థసారథి అన్నారు. బుధవారం ప్రజ్ఞాపూర్ ఏసీపీ కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కోర్టు ఆవరణలో జనా లు అధికంగా రావడంతో కోర్టుముందు రోడ్డు రద్దీగామారిందన్నారు. కోర్టుకు ప్రజలు వచ్చే సమయంలో వాహనాలు అతివేగంగా వెళ్లడం వల్ల గతంలో పలుమార్లు ప్రమాదాలు జరిగాయన్నారు. అలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఇక్కడ భారీ కేడ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని అనుకున్నామని తెలిపారు. ఇటీవల గజ్వేల్ ఏసీపీ గా ఏ.బాలాజీ నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కోర్టుకు వచ్చారన్నారు. అదే సమయంలో ఏసీపీ బాలాజీకి ఇక్కడ భారీకేడ్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. 24 గంటల్లో బారికేడ్లు కోర్టుమందు ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. వెంటనే స్పందించి ప్రమాదాలు జరగకుండా బారి కేడ్లు ఏర్పాటు చేయడం తో చాలా సంతోషకరామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు గజ్వేల్ కోర్ట్ బార్ అసోసియేషన్ తరపున కృతజ్ఞత తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ప్రశాంత్,స్వామి,నరేష్ చారి,తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ అనుమతులను రద్దు చేయాలి

నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని గుగ్గిల్ల,పోతారం శివారు గ్రామాల్లో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ నిర్మాణ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని అయా గ్రామాల ప్రజలు బుధవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేకు వినతిపత్రమందజేశారు.

ఎంపీడీఓ శ్రీధర్ ను సన్మానించిన ఎంపీపీ

నవతెలంగాణ-తొగుట

బదిలీ పై వెళ్లిన ఎంపీడీఓ శ్రీధర్ ను ఎంపీపీ గాంధారి లత నరేందర్ రెడ్డి బుధవారం ఘనంగా సన్మా నించారు. కొద్దిరోజుల క్రితం బదిలీ పై వెళ్లిన ఎంపి డిఓ శ్రీదర్ ను ఎంపీపీ గాంధారి లతా నరేందర్ రెడ్డి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, పిఆర్ ఏఈ రామ కృష్ణ రెడ్డి, ఎంపిటిసి వేల్పుల స్వామి ముదిరాజ్, సీని యర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంపీఓ చందన, ఏపీఓ కిషన్, పంచాయతీ కార్యదర్శులు, పిల్డ్ అసిస్టెం ట్లులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్దెకు చేరుకున్న సారలమ్మ

నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలంలోని అక్కెనపల్లి గ్రామంలో సమ్మక్క - సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం దప్పు చప్పుళ్లతో, శివ సత్తుల పూనకాల మధ్య సారలమ్మను గద్దెకు చేర్చారు. గ్రామంలోని దాసరి సింగరయ్య ఇంటి నుంచి ఊరేగింపుగా ఊరి పొలిమేరలో ఉన్న గద్దెల వద్దకు సారలమ్మను తీసుకువచ్చారు. గద్దెల సమీపంలో గల పులి గుండ్ల నుంచి నేడు సమ్మక్క గద్దెకు చేరుకోనుంది.. శనివారం అమ్మవార్లు తిరిగి వన ప్రవేశం చేయడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వరిలో గంధక దుష్ప్రభావ నివారణ చర్యలు పాటించాలి

నవతెలంగాణ -జగదేవపూర్

జగదేవపూర్ మండలం లో వరి పైర్లు గంధక దుష్ప్రభావం వలన తీవ్రంగా నష్టపోతున్నారని మండల వ్యవసాయ అధికారి అన్నారు. రైతులు వరిలో గంధక దుష్ప్రభావ నివారణ చర్యలు పాటించాలని సూచించారు.